జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 01, జులై 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## తొలి పెన్షన్ వీరికే



**మంగళగిరి,మహానాడు:** జూలై ఒకటి ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పెనుమాకలో పెరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ ఇంటి నుంచే లాంఛనంగా ప్రారంభించనున్నారు. తండ్రి కూతుళ్ళకి మొదటి పెన్షన్ అందజేయ బోతున్నారు.




# మళ్లీ 'మెగా' మెరుపులుంటాయా?

- మెగా కృష్ణారెడ్డి కంపెనీ బిల్లుల మాటేమిటి?
- గతంలో నవయుగ నుంచి పోలవరం కాంట్రాక్టు దక్కించుకున్న మేఘా కంపెనీ
- రివర్స్ టెండర్‌లో నష్టం జరిగిందన్న నాటి విపక్షనేత చంద్రబాబు
- టీడీపీని ఉతికేసిన టీవీ9,ఎన్టీవీలో మెగా భాగస్వామి
- ఇప్పుడు 1458 కోట్ల పోలవరం బిల్లు పెండింగ్
- ఆగమేఘాలపై సీఎంఓకు పంపిన ఆర్థికశాఖ అధికారిణి
- గతంలో చేసిన ఆరోపణలపై విచారణ జరిపిస్తుందా?
- బిల్లులు మంజూరు చేస్తారా? పెండింగ్‌లో పెడతారా?
- లోకేష్ రెడ్‌బుక్ 'మేఘా'తో మొదలవుతుందా?
- అందరి చూపూ మేఘా బిల్లుల వైపే

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఆయనవి 'మెగా' మెరుపులు. ప్రభుత్వంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆయన కత్తికి ఎదురుండదు. కాంట్రాక్టు పనులు పంచకల్యాణి గుర్రంలా పరిగెడుతుంటాయి. ఏ ప్రభుత్వంలో ఉన్నా అన్ని కాంట్రాక్టులు, వాటంతట అవే పరుగులు తీసి పువ్వులో పెట్టి అప్పగిస్తుంటాయి. విపక్షంలో ఉన్న పార్టీలు ఆయన కంపెనీ పనులపై విరుచుకుపడతాయి. మళ్లీ అవే పార్టీలు అధికారంలోకి వస్తే, విచిత్రంగా ఆయన కంపెనీకే కాంట్రాక్టులు ఇచ్చేస్తాయి. ఆయన లేకపోతే పాలకులకు నిమిషం జరగదు మరి.

ఎలక్టోరల్ బాండ్స్ అప్పగింతల ద్వారా తన అభిమానం చాటుకుంటుంటారు. ఆ విధంగా ఆ కంపెనీ గత ఎన్నికల ముందు 'కేవలం 966 కోట్లు', తను ముచ్చట పడ్డ పార్టీలకు విరాళంగా ఇచ్చింది. దాని అనుబంధ సంస్థ అయిన వెస్టర్స్ యుపి పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మరో 220 కోట్లు చదివించుకుంది. రైల్వే- టన్నెళ్లు-లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల్లో చేయి తిరిగిన ఈ కంపెనీ.. హిమాలయాల్లో జోజిల్లా రోడ్డు టన్నెల్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అలా ఆయన 'అందరివాడు'. ఆ కంపెనీ అందరిదీ. పైగా చేతిలో రెండు పవర్‌ఫుల్ న్యూస్ చానెళ్లు కూడా ఉన్నాయి. కాబట్టి ఆయన కంపెనీ ఏ మూలకూర్చున్నా కావలసినవన్నీ దగ్గరుండి మరీ వడ్డించేస్తుంటారు. 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' రవిశంకర్‌కే, బతకనేర్చే జీవితపాఠాలు చెప్పేంత గొప్ప కంపెనీ అది.

ఇప్పుడు ఆ కంపెనీకి పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి.. ఏపీ సర్కారు ఇవ్వాల్సిన 1458 కోట్ల రూపాయల పెండింగ్ బిల్లు వ్యవహారం, సీఎంఓకు చేరినట్లు సమాచారం. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. పోలవరం ప్రాజెక్టును నవయుగ నుంచి రివర్స్‌టెండర్ ద్వారా దక్కించుకున్న మేఘా కంపెనీకి, ప్రభుత్వం 1458 కోట్లు బకాయి పడింది. దానిని ఆగస్టులోగా ఇచ్చేస్తామని మిగతా.. 2లో



# వెంకయ్య నుంచి చాలా నేర్చుకున్నా...

- వ్యక్తిత్వం, దార్శనికతల మేలు కలయికే వెంకయ్య
- దేశ ప్రయోజనాలే మిన్న అని నమ్మిన వ్యక్తి
- ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్న ప్రధాని
- భారత పూర్వ ఉప రాష్ట్రపతి 75వ పుట్టినరోజు సందర్భంగా, వారి జీవిత విశేషాలతో మూడు పుస్తకాల ఆవిష్కరణ
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- యువత రాజకీయాల్లోకి రావాలి, సిద్ధాంతపరమైన రాజకీయా లను ప్రోత్సహించాలి - ముప్పవరపు వెంకయ్యనాయుడు

**హైదరాబాద్:** భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు నుంచి తాను చాలా నేర్చుకున్నానని భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. మంచి ఆలోచనలు, మంచి వ్యక్తిత్వం, దార్శనికతల మేలు కలయికే వెంకయ్య నాయుడిగారి జీవితమన్నారు.

వెంకయ్యనాయుడు 75వ పుట్టినరోజును పురస్కరించుకుని హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న అన్వయ కన్వెన్షన్‌లో "పంచ సప్తతి" పేరిట వారి మిత్రులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ వేదిక ద్వారా ప్రధానమంత్రి... మిగతా.. 2లో




# ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం కీలకం

- శక్తివంతమైన భాగస్వామ్యాలను నిర్మించడానికి ఇది మంచి వేదిక
- సాంకేతికత అభివృద్ధికి హైదరాబాద్ కేంద్ర బిందువు
- మోదీ నాయకత్వంలో దేశ గతిని మార్చే సంస్కరణలు
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో తాజ్ కృష్ణలో జరిగిన వాణిజ్య వ్యాపార వేత్తల ఆత్మీయ సదస్సులో మంత్రి పీయుష్ గోయల్‌తో కలిసిపాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:** భారత్‌ను మళ్లీ విశ్వగురుగా మార్చేందుకు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో తాజ్ కృష్ణలో జరిగిన వాణిజ్య వ్యాపార వేత్తల ఆత్మీయ సదస్సులో మంత్రి పీయుష్ గోయల్‌తో కలిసిపాల్గొన్న మిగతా.. 2లో

## చంద్రబాబు అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రా



**విజయవాడ,మహానాడు:** సీఎం చంద్రబాబు అదనపు కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రాను నియమిస్తూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. కార్తికేయ మిశ్రా ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.



డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం

నిజామాబాద్‌లో మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# డీఎస్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**నిజామాబాద్,మహానాడు:** పీసీసీ అధ్యక్షుడుగా 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి డీఎస్ ఎంతో కృషి చేశారు. 2009లోనూ డీఎస్ సారథ్యంలో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి వచ్చింది. విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి డీఎస్. కొంతకాలం పార్టీకి దూరమైనా, పార్లమెంట్ లో డీఎస్ ను సోనియాగాంధీ ఆప్యాయంగా పలకరించేవారు. పదవులపై తనకు ఎప్పుడూ ఆశ లేదని డీఎస్ అనేవారు. చనిపోయినపుడు తనపై కాంగ్రెస్ జెండా కప్పాలని డీఎస్ కోరిక. అందుకే ముఖ్య నాయకులను పంపి వారి కోరిక తీర్చాము. డీఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అండగా మిగతా.. 2లో



# ఇండియన్ ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

(వెంకట్)

ఇండియన్ ఆర్మీ చీఫ్‌గా జనరల్ ఉపేంద్ర ద్వివేది బాధ్యతలు స్వీకరించారు. 2022 మే నుంచి ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ మనోజ్ పాండే పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానాన్ని భర్తీ చేశారు.

జనరల్ ఉపేంద్ర ద్వివేది దీనికి ముందు ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా ఉన్నారు. పరమ విశిష్ట సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, మూడు జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్‌ఛార్జ్ కమెండేషన్ కార్డ్‌లను ఆయన అందుకున్నారు. మిగతా.. 2లో



ఖజానా ఖాళీ అయినా... ఇచ్చిన మాట తప్పలేదు

3లో




కాంట్రాక్టర్ వద్ద కమీషన్ల కోసం కక్కుర్తి

3లో



తెలంగాణలో క్రికెట్‌కు కొత్త జోష్

4లో



ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు.. పోలవరం, అమరావతిపై దృష్టి

4లో



రాజకీయ నేతల గుప్పెట్లో బందీలయిన క్రీడాసంఘాలు

4లో



అరకు కాఫీ అద్భుతం..

5లో



పోలవరంపై అంతర్జాతీయ నిపుణుల అధ్యయనం

6లో



నిరుద్యోగుల తరుపున నిలదీస్తాం అసెంబ్లీని స్తంభింప చేస్తాం

9లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 01, జులై 2024

# మళ్లీ 'మెగా' మెరుపులుంటాయా?

(మొదటిపేజీ తరువాయి..)

నాటి జగన్‌బాబు హామీ ఇచ్చినప్పటికీ, ఖజానాలో కాసులు లేక పెండింగ్‌లో పెట్టేశారట. ఆర్థికశాఖ కార్యదర్శి సత్యనారాయణ కూడా మెగా వారి మాదిరిగానే 'అందరివాడు' అయినప్పటికీ, ఖజానాలో కాసులు లేక బిల్లులలు సర్దుబాటు చేయలేకపోయారట.

తనకు మేళ్లు చేసిన జగన్ అధికారం కోల్పోయిన తర్వాత.. మెగా కంపెనీ బిల్లులు ఆగిపోతాయని, వైసీపీ సహా టీడీపీ-జనసేన-వైసీపీ-మీడియా వర్గాలు అంచనా వేశాయి. ఎందుకంటే.. గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు, మీడియా సంస్థలకు జగన్ సర్కారు బిల్లులు నిలిపివేసింది. ఇప్పుడు టీడీపీ సర్కారు కూడా అదేవిధానం పాటిస్తుందన్న అంచనా వ్యక్తమవుతోంది. పైగా టీడీపీని లక్ష్యంగా చేసుకుని బాబు-లోకేష్‌ను అప్రతిష్ఠపాల్జేసిన టీవీ9-ఎన్టీవీలో మేఘా భాగస్వామి కాబట్టి.. 'లోకేష్ రెడ్‌బుక్' మేఘా నుంచే అమలవుతుందన్న భావన పార్టీ వర్గాల్లో నెలకొంది.

పైగా ఐదేళ్ల జగన్ జమానాలో టీడీపీని రాజకీయంగా.. చంద్రబాబునాయుడు-లోకేష్‌పై వ్యక్తిగతంగా బురదచల్లి, జగన్ కళ్లలో ఆనందం చూసిన టీవీ9- ఎన్టీవీ సంస్థల్లో మెగా కంపెనీ భాగస్వామి కాబట్టి.. లోకేష్ రెడ్‌బుక్ ప్రకారం.. ఇక ఆ కంపెనీకి కష్టకాలం తప్పదన్న భావన అటు పార్టీ వర్గాల్లో కూడా కనిపిస్తోంది. అంటే ఒప్పందం ఉల్లంఘించిన మేఘా కాంట్రాక్టు రద్దు చేస్తారన్న భావన టీడీపీ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది.

ఈ నేపథ్యంలో శనివారం సెలవుదినం అయినప్పటికీ, మెగా కంపెనీకి చెల్లించాల్సిన 1458 కోట్ల రూపాయలకు సంబంధించిన బిల్లు వ్యవహారం, ఆగమేఘాలపై సీఎంఓకు వెళ్లడంపై ఆర్థికశాఖ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. 400 కోట్ల రూపాయల చొప్పున, మొత్తం బిల్లుల ఫైలు సీఎంకు చేరినట్లు తెలుస్తోంది.

దీనితో మెగా కంపెనీ బిల్లులు వెంటనే చెల్లిస్తారా? పెండింగ్‌లో పెడతారా? అన్న ఉత్కంఠకు తెరలేచింది. ఎందుకంటే.. పోలవరం ప్రాజెక్టు రివర్స్ టెండర్ల నుంచి, నత్తనడక పనుల వరకూ ప్రశ్నల వర్షం కురిపించిన టీడీపీనే, ఇప్పుడు అధికారంలో ఉన్నందున.. ఆ బిల్లుల వ్యవహారంపై ఉత్కంఠ నెలకొనడం సహజం.

పైగా.. మే నాటికి 7,380 కోట్ల సీలేరు పంప్డ్ స్టోరేజీ జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టును కూడా ఆ కంపెనీకే ఇచ్చారు. పోలవరం హైడల్ ప్రాజెక్టు కాలపరిమితిని, మరో 36 నెలలపాటు పొడిగించాలని ఎన్నికల ముందు వరకూ జెన్కోపై ఒత్తిడి తీసుకురావడం, ఆ మేరకు జగన్ జమానాలో సీఎంఓలో ఒక వెలుగువెలిగిన ఓ కడప రెడ్డి గారు జెన్కోపై ఒత్తిడి తీసుకురావటం అప్పట్లోనే మీడియా వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

సీలేరు పంప్డ్ స్టోరేజీ జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు- పోలవరం హైడల్ ప్రాజెక్టు అంచనా వ్యయం పెంచడం ద్వారా, 10,180 కోట్ల ఆర్థిక ప్రయోజనం పొందేలా.. ఇంధనశాఖపై నాటి సీఎంఓ జగన్‌భక్త బృందం, ఒత్తిడి పెంచిందన్న ఆరోపణలు అప్పట్లో వినిపించిన విషయం బహిరంగమే.

నిజానికి రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని.. మేఘా కంపెనీ 2019 నవంబర్‌లో 1558.13 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రాజెక్టు దక్కించుకుంది. అయితే, చెప్పిన విధంగా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయింది. అదే ఊపులో 3,270 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో.. పోలవరం విద్యుదుత్పత్తి ప్లాంటును, 2024 నాటికి పూర్తి చేస్తానని జెన్కోతో ఒప్పందం చేసుకుంది. కానీ అక్కడా అదే



పరిస్థితి.

ఫలితంగా ఒప్పంద కాలపరిమితి ముగిసింది. నిబంధనల ప్రకారమైతే.. కాలపరిమితి లోపు, ప్రాజెక్టు పూర్తి చేయనందుకు కంపెనీకి జరిమానా లేదా.. 60 సీ నిబంధనల కింద కాంట్రాక్టు రద్దు చేయాలి. కానీ విచిత్రంగా తమ గడువు పెంచాలని మేఘా కంపెనీ కోరడం, దానిని జెన్కోలో చర్చకు పెట్టడం వాయువేగంతో జరిగిపోయింది. సీఎంఓలో చక్రం తిప్పిన కడప రెడ్డిగారు, దానికోసం చాలా శ్రమదానం చేశారన్న విమర్శలు అప్పట్లోనే వినిపించిన సంగతి తెలిసిందే.

సాగునీటి ప్రాజెక్టు ప్రధాన పనులు పూర్తయితేగానీ విద్యుదుత్పత్తి ప్లాంటును పూర్తి చేయడం కుదరదని, పోలవరం సాగునీటి ప్రాజెక్టును 2026లో పూర్తి చేస్తామని కేంద్ర జలవనరుల శాఖ వెల్లడించిందంటూ.. జెన్కోకు మేఘా కంపెనీ ఒక లేఖ రాసింది. కాగా మే నెలలో జరిగిన జెన్కో బోర్డు సమావేశంలో, మేఘా లేఖను అజెండాగా చేర్చారు. అయితే దానిని తిరస్కరించిన బోర్డు.. దానిపై కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దానితో ఇప్పుడు కొత్త ప్రభుత్వం నిర్ణయం కోసం వేచిచూడక తప్పని పరిస్థితి.

ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడ్డ టీడీపీ ప్రభుత్వం.. మేఘా కంపెనీకి పోలవరం హైడల్ పవర్ ప్రాజెక్టు కాలపరిమితి పెంచుతుందా? సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేయనందున 60 సీ నిబంధనల కింద కాంట్రాక్టు రద్దు చేస్తుందా? లేక జరిమానాతో విడిచిపెడుతుందా? సీలేరు పంప్డ్ స్టోరేజీ జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు- పోలవరం హైడల్ ప్రాజెక్టు అంచనా వ్యయం పెంచడం ద్వారా, 10,180 కోట్ల ఆర్థిక ప్రయోజనం పొందేందుకు సహకరిస్తుందా? తిరస్కరిస్తుందా? అన్న ప్రశ్నలు తెరపైకొచ్చాయి.

# రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**సంపద సృష్టిస్తాం సంపదను ప్రజలకు పంచుతాం**

**మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం**

**ఖమ్మంలో స్తంభాద్రి ఆసుపత్రిని ప్రారంభించిన డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క**

**మధిర నియోజకవర్గంలోని చింతకాని, మధిరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

ఖమ్మం, మహానాడు:

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు ఆదివారం ఖమ్మం పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం మధిర నియోజకవర్గంలోని చింతకాని, మధిర మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సంపద రాష్ట్ర ప్రజలకు చెందాలని తమ ప్రభుత్వం ఈ గ్యారెంటీలను తీసుకువచ్చింది అన్నారు. గత దశాబ్ద పాలనలో అప్పుల పాలైన తెలంగాణను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నామని చెప్పారు.

సంపదను సృష్టించి, సృష్టించిన సంపదను ప్రజలకు పంచుతామన్నారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు పోతుందని చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఆర్థికంగా ఎదగడానికి క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను అప్పగించామన్నారు. తెలంగాణలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయబోతున్న మీ సేవ సెంటర్ల నిర్వహణ కూడా మహిళలకు అప్ప చెప్తామని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వావలంబన కొరకై తమ ప్రభుత్వం మహిళ స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తుందని వివరించారు.

ఆసుపత్రి ప్రారంభం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హైద్రాబాద్ ప్రజాభవన్ నుంచి ఉదయం 7గంటలకు రోడ్డు మార్గాన ఖమ్మంకు చేరుకున్న డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కకు జిల్లా అధికార యంత్రాగం, పార్టీ జిల్లా నాయకులు, శ్రేణులు స్వాగతం పలికారు. ఉదయం 11గంటలకు ఆర్‌సిఎం చర్చ్ ఎదురుగా స్థంబాద్రి హస్పిటల్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు.

ఆసుపత్రి మూడవ అంతస్తులో క్యాత్ ల్యాబ్ ను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆక్కడి నుంచి చింతకాని మండలం గాంధినగర్ కు చేరుకొని రూ.175లక్షలతో గాంధినగర్ నుంచి బొప్పారం వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన



చేశారు. ఆ తరువాత మధిర మండలం వంగవీడు గ్రామానికి చేరుకొని రూ. 30 కోట్లతో బోనకల్లు- అల్లపాడు- వంగవీడు గ్రామాల వరకు బిటి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. చిలుకూరు గ్రామంలోని శివాలయం వద్ద రూ.70 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ.285 లక్షలతో చిలుకూరు నుంచి దొడ్డదేవరపాడు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మధిర మండలం మర్లపాడు గ్రామానికి చేరుకొని. రూ.275 లక్షలతో మర్లపాడు నుంచి పెనుగొలను-సిద్దినేని గూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్తాపన చేశారు. ఆ తరువాత మాటూరు గ్రామానికి చేరుకొని రూ.500 లక్షలతో మాటూరు నుంచి ముస్లీం కాలనీ బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఆనంతరం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారి పొడవున ఆయా గ్రామాల ప్రజలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు ఘనంగా స్వాగతం పలికారు.

# ఇండియన్ ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

(మొదటిపేజీ తరువాయి..)

కాగా, మధ్య ప్రదేశ్‌కు చెందిన ఉపేంద్ర ద్వివేది, సైనిక్ స్కూల్ రేవాలో చదివారు. 1981 జనవరిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీయే) లో చేరారు. 1984 డిసెంబర్‌లో జమ్ముకశ్మీర్ రైఫిల్స్ 18వ బెటాలియన్‌లో నియమితులయ్యారు.

ఆ తర్వాత కశ్మీర్ లోయ, రాజస్థాన్ ఎడారు లలో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల బెటాలియన్‌కు నేతృత్వం వహించారు. మరోవైపు, ఇన్‌స్పెక్టర్ జనరల్ అస్సాం రైఫిల్స్, అస్సాం రైఫిల్స్ సెక్టార్ కమాండర్‌గా తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో ఉపేంద్ర ద్వివేది విశేష సేవలు అందించారు. ఈశాన్య ప్రాంత కమాండర్‌తో పాటు ఇండో-మయన్మార్ సరిహద్దు నిర్వహణ బాధ్యతలు వహించారు. ఆ తర్వాత రైజింగ్ స్టార్ కార్ప్స్ ను కమాండ్ చేశారు. 2022-2024 వరకు సవాళ్లతో కూడిన వెస్టన్ ఫ్రంట్, నార్తర్న్ ఆర్మీకి నేతృత్వం వహించారు.

# ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం కీలకం

(మొదటిపేజీ తరువాయి..)

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, పారిశ్రామిక వేత్తలకు మధ్య నిర్మాణాత్మకమైన చర్చకు ఈ వేదిక చాలా కీలకమైంది.

ఇలాంటి నిర్మాణాత్మక చర్చల ద్వారానే అందరి భాగస్వామ్యంతో దేశ భవిష్యత్తుకు బాటలు పడతాయి. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపే క్రమంలో.. మనకు ఎదురయ్యే సవాళ్ల గురించి భారతీయ కార్పొరేట్ కంపెనీలతో చర్చించేందుకు, వినూత్న ఆలోచనలు పంచుకోవడానికి, శక్తివంతమైన భాగస్వామ్యాలను నిర్మించడానికి ఇది మంచి వేదిక.

పరిశోధన, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, సాంకేతికత అభివృద్ధికి మన హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉంది. పురోభివృద్ధికి హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉంది. ఈ విషయం చాలా సార్లు నిరూపితమైంది. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో స్పష్టంగా రుజువైంది. హైదరాబాద్ లో తయారైన వ్యాక్సిన్ యావత్ ప్రపంచంలో కరోనా భయాన్ని తొలగించింది. మన దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్‌గా, విశ్వ గురుగా తీర్చిదిద్దడానికి మన స్టార్టప్‌లు సాంకేతికంగా అద్భు తమైన పురోభివృద్ధిని సాధించాయి. ప్రైవేట్ రంగం భాగస్వామ్యం, సాంకేతిక పురోగతి ద్వారా సుస్థిరమైన ఆర్థిక ప్రగతిని సాధ్యమవుతుంది.

ఉద్యోగాల కల్పన, ఎగుమతులు పెంచడానికి, ప్రపం చంతో మన దేశం పోటీ పడటానికి మీ పెట్టుబడి, వినూత్న ఆలోచనలు కీలకమైనవి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో దేశ గతిని మార్చే సంస్కరణలు చోటు చేసుకున్నాయి. GST, బ్యాంకింగ్ సంస్కరణలు, డిజిటైజేషన్ ను పరుగులు పెట్టించడం వంటి సంస్కరణలు దేశాన్ని వేగంగా ముందుకు నడిపించాయి. ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీముల వల్ల అనేక రంగాల్లో స్థానికంగా ఉత్పాదకత పెరిగింది. స్టార్టప్ కల్చర్ మన దేశ ప్రగతిలో కొత్త అధ్యాయం లిఖించింది. సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రోగ్రాంలో భాగంగా అనేక R&D సంస్థలకు గ్రాంట్లు లభిం చాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీలో అత్యాదునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని మేం ప్రోత్రహిస్తున్నాం. ప్రధానమంత్రి మార్గదర్శనంలో, 2030 నాటికి 100 మిలియన్ టన్నుల కోల్ గ్యాసిఫికేషన్ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నాం. ఈ విషయంలో ప్రైవేటు రంగం కీలక పాత్ర పోషిస్తుంది. 2015 నుంచి ప్రైవేటు రంగానికి అనేక ప్రోత్సా హకాలు అందించాం.

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు అన్ని రంగాలకు అవసరమైన సహకారం అందిస్తున్నాం. మోదీ ప్రభుత్వం మీకు అండగా ఉంది. భారత్ ను మళ్లీ విశ్వగురు వుగా చేసేందుకు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం చాలా కీలకం.



## డీఎస్ మరణం కాంగ్రెస్ పార్టీకి
# తీరని లోటు

(మొదటిపేజీ తరువాయి..)

నిలబడుతుంది. కుటుంబ సభ్యులతో చర్చించి డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం. డీఎస్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు.

# వెంకయ్య నుంచి చాలా నేర్చుకున్నా...

(మొదటిపేజీ తరువాయి..)

వెంకయ్య నాయుడి జీవన ప్రస్థానం ఆధారంగా రూపుదిద్దుకున్న 1. వెంకయ్య నాయుడు (ఐ లైఫ్ ఇన్ సర్వీస్) - జీవన ప్రస్థానం - ఆంగ్లం, 2. సెలబ్రేటింగ్ భారత్ (13వ ఉపరాష్ట్రపతిగా 5 ఏళ్ళ ప్రయాణం) - ఆంగ్లం, 3. మహానేత (జీవన చిత్రమాలిక) - తెలుగు పుస్తకాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ వెంకయ్య నాయుడితో తన సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయనతో కలిసి సుదీర్ఘకాలం పాటు పని చేసే అవకాశం దక్కిందన్నారు. ఆయన భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడిగా పని చేసిన కాలంలో, తన మంత్రివర్గంలో సీనియర్ మంత్రిగా పని చేసినప్పుడు, ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తించినప్పడు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం దక్కిందన్నారు.

"ఒక చిన్నగ్రామం నుంచి ప్రస్థానం మొదలు పెట్టి, పెద్ద పెద్ద పదవులు చేపట్టిన వెంకయ్యనాయుడిగారి అనుభవ సంపద అమూల్యం. ఆయన నుంచి నేను చాలా నేర్చుకున్నాను. మంచి ఆలోచనలు, మంచి వ్యక్తిత్వం, దార్శనికతల మేలు కలయికే వెంకయ్యనాయుడి జీవితం." అని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొన్ని దశాబ్దాల క్రితం భారతీయజనతాపార్టీ, జనసంఘ్‌కు పెద్దగా పునాది లేదన్న సంగతిని మోదీ గుర్తు చేస్తూ అటువంటి రోజుల్లోనే వెంకయ్యనాయుడు దేశ ప్రయోజనాలే అన్నింటికన్నా ముందు అని విశ్వసించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏబీవీపీ కార్యకర్తగా ఎంతో కష్టపడి, తదనంతరం పార్టీని నమ్ముకుని పని చేశారని కొనియాడారు.

అత్యయిక స్థితికి వ్యతిరేకంగా వెంకయ్యనాయుడు పోరాడారని గుర్తు చేసిన నరేంద్ర మోదీ, 17 నెలల పాటు జైల్లో నిర్బంధించినా ఆయన వెనకంజ వేయకుండా ధైర్యంగా పోరాడారని కొనియాడారు. వెంకయ్యనాయుడు రాజకీయాలను, అధికారాన్ని సేవా మార్గంగా భావించారన్న ఆయన, వాజ్పేయి ప్రభుత్వంలో వెంకయ్యనాయుడికి మంత్రిగా అవకాశం వచ్చినప్పుడు ఆయన ఏరికోరి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బాధ్యతలు చేపట్టారని చెప్పారు. "వెంకయ్యనాయుడు గ్రామాలకు, పేదలకు, రైతులకు సేవ చేయాలనుకున్నారు." అని పేర్కొన్నారు. ఆ తర్వాత తన హయాంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా స్వచ్ఛభారత్ మిషన్, స్మార్ట్ నగరాల వంటి కార్యక్రమాలను ఎంతో చక్కగా ముందుకు తీసుకెళ్లారన్నారు.

ముప్పవరపు వెంకయ్యనాయుడు సౌమ్యత, చమత్కారంతో కూడిన వాక్చాతుర్యాన్ని ప్రశంసించిన ప్రధానమంత్రి వారి తెలివితేటలు, సహజత్వం, త్వరితగతిన ప్రతిస్పందించటం, వన్ లైనర్లకు ఎవరూ సాటి లేరని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అటల్ జీ నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన సమయంలో "ఒక చేతిలో బీజేపీ జెండా - మరో చేతిలో ఎన్డీయే అజెండా" అంటూ వారు ఇచ్చిన నినాదాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా 2014లో మోదీ (MODI) అనే అక్షరాలకు మేకింగ్ ఆఫ్ డెవలప్డ్ ఇండియా అనే సంక్షిప పదాన్ని ఇచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. వారి మాటల్లోని లోతు, గాంభీర్యం, దార్శనికత, వివేకం వంటివి తనకు అనేక సందర్భాల్లో ఆశ్చర్యపరిచాయని గుర్తు చేశారు.

వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు సభలో ఉన్న సానుకూల వాతావరణాన్ని గుర్తు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆ సమయంలో సభలో జరిగిన సానుకూల చర్చల గురించి ప్రస్తావించారు. ఆర్టికల్ 370 బిల్లును ముందుగా రాజ్యసభలో ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ, సభా ఔన్నత్యం, మర్యాదలను కొనసాగిస్తూనే ఇలాంటి ముఖ్యమైన బిల్లు ఆమోదం పొందటంలో వారి అనుభవజ్ఞత ఎంతగానో ఉపయోగపడిందని ప్రశంసిచారు. వెంకయ్యనాయుడు పరిపూర్ణమైన జీవితాన్ని, సంపూర్ణ ఆరోగ్యంతో గడపాలని ప్రధాని ఆకాంక్షించారు.

భావోద్వేగాలు, ప్రతికూలతలు వంటి అంశాలు వెంకయ్య నాయుడు నిర్ణయాధికారాన్ని ప్రభావితం చేయలేకపోయాయన్న ప్రధానమంత్రి, సంక్రాంతి వంటి తెలుగు పండుగల సందర్భంలో ఢిల్లీలో వెంకయ్య నివాసంలో జరిగిన సంబరాల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. భారతదేశ రాజకీయాల్లో వెంకయ్య నాయుడు సేవలను ప్రశంసించిన ఆయన, ఈరోజు ఆవిష్కరించిన మూడు పుస్తకాలు యువతకు స్ఫూర్తిదాయకమైనవి అని పేర్కొన్నారు. 2047లో అభివృద్ధి చెందిన భారతదేశం స్వాతంత్ర శతాబ్ధి ఉత్సవాలను జరుపుకోనుందని,




అదే సమయంలో వెంకయ్యనాయుడు కూడా తమ జీవన శతాబ్ధి మైలురాయిని జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి సందేశానికి ధన్యవాదాలు చెప్పిన పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, నరేంద్రమోదీ దిశానిర్దేశకత్వంలో దేశం ప్రగతిబాటన పయనిస్తోందని, మంచి పథకాలతో రైతులు, పేదలు, మహిళలు, యువత సహా అన్ని రంగాలకు చెందిన ప్రజల ఉన్నతికి బాటలు వేస్తున్న వారి చొరవను ప్రశంసించారు.

ఇది భవిష్యత్ లో మరింత వేగంగా, క్షేత్ర స్థాయికి చేరుకోవాలని, పేదరిక నిర్మూలనకు మరింత కృషి జరగాలని ఆకాంక్షను వ్యక్తం చేసిన ఆయన, ఉచితాలను ప్రజలకు అలవాటు చేయవద్దని సూచించారు. అర్హులకు సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే నైపుణ్యాభివృద్ధి జరగాలని చెప్పారు.

ప్రాథమిక స్థాయి మొదలుకుని సాంకేతిక విద్య వరకూ మాతృభాషలో బోధన ఉండాలన్న ఆయన, విద్యావ్యవస్థలో ఈ దిశగా త్వరితగతిన సానుకూల మార్పులను వేగవంతం చేయవలసిన అవసరం ఉందని ప్రధానికి తెలిపారు.

పంచ సప్తతి కార్యక్రమానికి విచ్చేసిన ఆత్మీయులందరికీ ధన్యవాదాలు తెలిపిన ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాజకీయాల్లోకి యువత రావాలని ఆకాంక్షించారు. అయితే సిద్ధాంత పరమైన రాజకీయాలకు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు సైతం విలువలతో కూడిన రాజకీయాలకు ప్రాధాన్యత పెంచాలని, పార్టీ అభ్యర్థులకు ప్రవర్తనా నియమావళి రూపొందించాలని సూచించారు. అభ్యర్థుల గుణగణాలకు, సిద్ధాంతపర రాజకీయాలకు పెద్ద పీట వేయాలని సూచించారు. కులం, ధనం ప్రభావం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని స్పష్టం చేశారు. సభ ఔన్నత్యాన్ని పెంచే విధంగా సభ్యులు ప్రవర్తించాలని ఆయన సూచించారు.

3

జనం గుండె చప్పుడు


మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 01, జులై 2024

# కాంట్రాక్టర్ వద్ద కమీషన్ల కోసం కక్కుర్తి

- కాంగ్రెస్‌లోనూ కొందరు ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారు
- కమీషన్లకు కక్కుర్తి పడటంవల్లే స్మార్ట్ సిటీ పనుల్లో జాప్యం
- తక్షణమే స్మార్ట్ సిటీ నిధుల అవకతవకలు, కమీషన్ల బాగోతంపై విచారణ జరపాలి
- స్మార్ట్ సిటీ మిషన్ దేశవ్యాప్తంగా పొడిగింపు
- నిధుల విడుదల, పొడిగింపుపై గతంలో 3సార్లు లేఖ రాసిన
- కేంద్ర నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ పట్టణాల అభివృద్ధికి మహర్దశ
- గత బీఆర్ఎస్ సర్కార్ స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లించడంవల్లే అభివృద్ధి కుంటుపడింది
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**ఢిల్లీ,మహానాడు:**

దేశవ్యాప్తంగా స్మార్ట్ సిటీ మిషన్ ను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కి ధన్యవాదాలు. కేంద్ర నిర్ణయంవల్ల కరీంనగర్, వరంగల్ పట్టణాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి అయ్యే అవకాశాలు మెరుగయ్యాయి.

స్మార్ట్ సిటీ నిధులను విడుదల చేయాలని గతంలో నేను మూడు సార్లు లేఖ రాశాను. కరోనా వల్ల రెండేళ్ల కాలం వృధా కావడంతో స్మార్ట్ సిటీ మిషన్‌ను పొడిగించాలని కోరాం. బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా వచ్చిన విజప్తులపట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వచ్చే మార్చి నెలాఖరు వరకు స్మార్ట్‌సిటీ మిషన్‌ను పొడిగించినందుకు సంతోషంగా ఉంది.

కేంద్ర నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ పట్టణాలకు మహర్దశ రానుంది. పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందే అవకాశాలు మెరుగయ్యాయి. అయితే కేంద్ర నిధులు దారి మళ్లించకుండా చూడటంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మ్యాచింగ్ గ్రాంట్ నిధులను సకాలంలో మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలి.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్మార్ట్ సిటీ మిషన్ నిధులను దారి మళ్లించింది. కేంద్రం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించి సత్వర పనులు పూర్తి చేసినట్లయితే కరీంనగర్, వరంగల్ పట్టణాలు ఇప్పటికే అద్దంలా మెరిసేవి.

కానీ రాష్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయకపోవడంతోపాటు కేంద్ర నిధులను కూడా దారి మళ్లించింది. నేను పార్లమెంట్ స్టాండింగ్ కౌన్సి ల్‌లో నిలదీసిన తరువాత కేంద్ర నిధులను జమ చేశారు.

గత పాలకులు కమీషన్లకు కక్కుర్తి పడటంవల్లే స్మార్ట్ సిటీ పనుల్లో జాప్యం జరిగింది. కాంట్రాక్టర్ నుండి కమీషన్లు దొబ్బడం కొందరు పాలకులకు ఆనవాయితీగా మారింది. కాంగ్రెస్ పార్టీలో కొందరు నేతలు మళ్లీ కమీషన్ల కోసం అవతారమెత్తారు. తక్షణమే స్మార్ట్ సిటీ నిధుల అవతవకలు, కమీషన్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

# జులై 1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా 'స్టాప్ డయేరియా'

- కేంద్రం ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ సర్వ సన్నద్ధం
- ఐదేళ్లలోపు చిన్నారుల్లో డయేరియా మరణాల్ని నిరోధించడమే లక్ష్యం

**అమరావతి,మహానాడు:**

జులై 1 నుండి ఆగస్టు 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'స్టాప్ డయేరియా' అవగాహన, ప్రచార, కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏపీ వైద్య ఆరోగ్య శాఖ సర్వ సన్నద్ధమయ్యింది. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు దిశానిర్దేశం మేరకు అన్ని జిల్లా, సెకండరీ హెల్త్ ఆసుపత్రులు, వైద్య ఆరోగ్య శాఖాధికారులకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ డాక్టర్ యస్. వెంకటేశ్వర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తోంది. ఐదేళ్ల లోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 'స్టాప్ డయేరియా' ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ మేరకు జూన్ 14 నుండి సన్నాహక చర్యల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా, జులై 1 నుండి ఆగస్టు 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది.

డయేరియా (నీళ్ళ విరోచనాల) కారణంగా సంభవిస్తున్న చిన్నారుల మరణాలను నిరోధించడమే లక్ష్యంగా దీన్ని రూపొందించారు. ఇప్పటికే అమలులో ఉన్న డయేరియా నివారణ కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ఇవ్వడంతో పాటు రెండు వారాల పాటు జింక్ ట్యాబ్లెట్లు ఇస్తున్నారు. దీన్ని మరింత విస్తరించి కొత్తగా రూపొందించిన స్టాప్ డయేరియా కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు 2 ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు 14 రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లను కూడా అందజేస్తారు.

అంతేకాకుండా డయేరియా వ్యాధి నిరోధానికి పూర్తి స్థాయిలో తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు గాను 2 నెలల పాటు సుదీర్ఘ ప్రచార కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం అమలులో వైద్య ఆరోగ్య శాఖతో పాటు గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, పట్టణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం వంటి పలు ప్రభుత్వశాఖలు భాగస్వామ్యమయ్యేలా వైద్య ఆరోగ్య శాఖ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

ఐదేళ్లలోపు చిన్నారుల్లో నీళ్ల విరేచనాల నిరంతర సమస్యను పరిష్కరించడానికి, మరణాలను పూర్తి స్థాయిలో నిరోధించడానికి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ దీర్ఘకాల ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడిసిఎఫ్) కార్యక్రమాన్ని 'స్టాప్ డయేరియా 'పేరుతో కొత్తగా రూపొందించింది. 2014లో ప్రారంభమైన ఈ కార్యక్రమం, డయేరియా సమస్యను నిరోధించడం, దాని నుండి చిన్నారులను రక్షించడం, చికిత్స అందించడం వంటి చర్యలు తీసుకుంటోంది.

తాజాగా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్)తో పాటు జింక్ ట్యాబ్లెట్ల వినియోగాన్ని పెంచడంపై దృష్టి సారించింది. కాగా కొత్తగా చేపట్టిన ఈ కార్యక్రమంలో డయేరియా , వ్యక్తి గత, పరిసరాల పారిశుధ్య నిర్వహణ, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, టాయిలెట్ల నిర్వహణ, శుభ్రత, చిన్నారులకు ఓఆర్ఎస్ అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ రెండు దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. మొదటి దశలో స్టాప్ డయేరియా సన్నాహక




కార్యక్రమం జూన్ 14 నుండి 30 వరకు వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టగా, రెండో దశ కార్యక్రమాన్ని జూలై 1 నుండి ఆగస్టు 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ నుంది.

ఈ సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆశా వర్కర్లు, ఎఎన్ ఎం, సిహెచ్వోల ద్వారా పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. ఐదేళ్లలోపు పిల్లలున్న ఇళ్లకు వీరు వెళ్లి డయేరియా బారిన పడకుండా ఉండాలంటే ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి, డయేరియా బారిన పడ్డాక ఏంచేయాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. డయేరియా సోకిన వెంటనే ఓఆర్ ఎస్ ద్రావణాన్ని తయారు చేయడం, వాడడం వంటి విషయాల్ని వివరించడమే కాకుండా డయేరియా ఉన్నట్లు సమాచారమందిస్తే 14 రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లను కూడా అందించేలా చర్యలు తీసుకుంటారు. దీంతో పాటు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, టాయిలెట్ల నిర్వహణ, సబ్బుతో చేతులు కడుక్కోవడం, సురక్షిత నీటి వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రచార సామగ్రిని ఆశా, ఎఎన్ ఎం, సిహెచ్వోల బృందాలకు అందజేసింది. స్టాప్ డయేరియా సన్నాహక కార్యక్రమాన్ని జూన్ 24న కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖామంత్రి జె.పి.నడ్డా న్యూఢిల్లీలో ప్రారం భించిన విషయం తెలిసిందే.

### స్టాప్ డయేరియా ప్రచారంలో ప్రధానాంశాలు

ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య వసతుల్లో సరైన నిర్వహణ, అవసరమైన వైద్య సామాగ్రి (ఓఆర్ఎస్, జింక్) లభ్యతను నిర్ధారించడం.

స్వచ్ఛమైన నీటిని అందుబాటులోకి తేవడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం. సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్యాన్ని అందించడానికి పటిష్టమైన నాణ్యతా నియంత్రణ చర్యలు, స్థిరమైన పద్ధతుల్ని అమలు చేయడం,

పోషకాహార కార్యక్రమాల్ని మెరుగుపరచడం, మెరుగైన పోషకాహార కార్యక్రమాల ద్వారా అతిసార వ్యాధులకు ప్రధాన కారణమైన పోషకాహార లోపాన్ని పరిష్కరించడం,

పరిశుభ్రతకు సంబంధించి అవగాహన కార్యక్రమాల్ని ప్రోత్సహించడం, సమగ్ర పరిశుభ్రత విద్యా కార్యక్రమాల ద్వారా పిల్లల్లో అవగాహన కల్పించేందుకు పాఠశాలల్ని సన్నద్ధం చేయడం, అలాగే ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడం వంటి కార్యక్రమాల్ని చేపట్టేలా స్టాప్ డయేరియాను రూపొందించారు.

## అంబటి.. నీకు తెలిసిన విద్యలు వేరే : మంత్రి అచ్చెన్నాయుడు



**మంగళగిరి,మహానాడు:**

అంబటి.. నీకూ చంద్రబాబుకి పోలికా? అంటూ మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్ అయ్యారు. కాఫర్ డ్యామ్ లేకుండా పోలవరం కడతామని కేంద్రం చెప్పిన విషయాన్నే చంద్రబాబు చెప్పారని అన్నారు. అయినా ఇది నీ సబ్జెక్ట్ కాదు.. నీకు తెలిసిన విద్యలు వేరే ఉన్నాయంటూ సెటైర్లు వేశారు.

# ఖజానా ఖాళీ అయినా...
# ఇచ్చిన మాట తప్పలేదు

- రాష్ట్ర ప్రజల తరపున సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు
- జులై 1వతేదీ 65 లక్షల మంది ఫించన్లు పంపిణీ
- రాష్ట్రమంతా ఫించన్ల పండుగ
- ఫించన్ల పంపిణీ కోసం 8వేల మంది ఉద్యోగులు సిద్ధం
- అన్నీ ఏర్పాట్లు పూర్తి
- పాలన చేతకాని జగన్
- అప్పుల్లో కూరుకుపోయిన ఆంధ్ర రాష్ట్రం
- గాడిలో పెట్టే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉంది
- రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- ఫించన్ల పంపిణీపై నెల్లూరు కార్పొరేషన్లో... అధికారులతో తొలిసారి సమీక్షించిన నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్



**నెల్లూరు,మహానాడు:**

రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయినా...ప్రజలకి ఇచ్చిన మాట తప్పకుండా నెరవేరుస్తున్న ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని...రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రశంసించారు. జులై 1వతేదీ ఫించన్ల పంపిణీ కార్యక్రమంపై... నెల్లూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో, అధికారులతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలిసి నారాయణ సమీక్షించారు. ఫించన్ల పంపిణీ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకి నారాయణ సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ నారాయణ మీడియాతో మాట్లా డుతూ... ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు 3వేల ఫించనుని రూ. 4వేలు...అలాగే దివ్యాంగులకి 3వేలు నుంచి 6వేలు చేస్తామని...హామీ ఇచ్చారన్నారు. సీఎం అయిన తరువాత దానిపైనే మొదటి సంతకం చేశారని... కేబినెట్‌లో కూడా దీనిని ఆమోదించారన్నారు. దానిని జులై 1వతేదీన లబ్ధిదారులందరికి ఫించను ఇవ్వాలని ఆదేశించారన్నారు.

రాష్ట్రంలో 65 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి అన్నీ జిల్లాల్లో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారన్నారు. నెల్లూరు జిల్లాలో కూడా పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేశారని చెప్పారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపైన నేను, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు కలిసి కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించామన్నారు.

ఫించన్ల కోసం సుమారు 8వేల మంది ఉద్యోగుల్ని నియమించామన్నారు. ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్... ఫించన్లను వాలంటీర్లు పంపిణీ చేయ కూడదని ఆదేశిస్తే, దానిని కూడా టీడీపీ చేయించిందని ఆరోపించారన్నారు. ఫించన్లు పంపిణీ చేసేందుకు సెక్రటేరియట్ ఉందని, చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని వారి చేత ఇప్పించమని తెలిపారన్నారు. దానిని వైసీపీ ప్రభుత్వం పాటించకపోవడంతో ఎంతో మంది లబ్ధిదారులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

కానీ రేపు సెక్రటేరియట్ ఎంప్లాయిస్, మిగతా ఎంప్లాయిస్ అందరూ కలిసి ఒకే రోజు ఫించన్లు పంపిణీ పూర్తి చేయాలని, కానీ పక్షంలో రెండో రోజు లోపే పూర్తి చేయాలన్నారు. దీని కోసం అధికారులందరూ చక్కగా ఏర్పాట్లు పూర్తి చేశారని, ఇందుకు అధికారులందరిని ఆయన అభినందించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయినా, ఎన్నో ఇబ్బందులు ఉన్నా, ఇచ్చిన మాట ప్రకారం...అవ్వా తాతలు, దివ్యాంగుల లబ్ధిదారులందరికి ఫించన్లు అందచేస్తున్నారన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రజలందరి తరపున సీఎం చంద్రబాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు.

2019లో నేను మంత్రిగా ఉన్నప్పుడు రూ. 5300 కోట్లతో కొన్ని ప్రాజెక్టులను తీసుకువచ్చానన్నారు. కానీ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టులన్నీ పక్కన పెట్టేసిందన్నారు. అవన్నీ పూర్తయి ఉంటే... రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 240 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు. ఆంధ్రరాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు.

రాష్ట్రాభివృద్ధి జరగాలంటే ముఖ్యంగా ఆదాయం పెరగాలని, పరిశ్రమలు రావాలని, రియల్ ఎస్టేట్ పెరగాలని, ఇలాంటి ఆలోచన్లి జగన్ చేయలేదన్నారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డితోపాటు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తోపాటు... కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న బాబు

- చంద్రబాబు హామీ.. మచిలీపట్నంలో తొలి పెన్షన్ అందుకోనున్న పర్వీన్



**మచిలీపట్నం,మహానాడు:** ఫత్తుల్లాబాద్‌కు చెందిన సీమా ఫర్వీన్ (21) అనే దివ్యాంగురాలు సోమవారం తొలి పెన్షన్ అందుకోనుంది. 100% వైకల్యంతో... మంచానికే పరిమితమైన సీమా ఫర్వీన్‌కి గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనల పేరుతో ప్రతి నెల వస్తున్న పెన్షన్ ను నిలిపి వేశారు. దీనిపై ఎన్నికల ప్రచారానికి మచిలీపట్నం వచ్చిన చంద్రబాబు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పర్వీన్‌కు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఫర్వీన్‌కు రూ.15వేల పెన్షన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు.

# టీడీపీ ఆఫీసుపై వైసీపీ దాడి తప్పే...

- నెలకు 4 వేల పెన్షన్ మంచిదే
- బాబు పాలనపై అప్పుడే స్పందించను
- ఇరు వర్గాలు సంయమనం పాటించాలి
- ప్రజలు అంగీకరించలేదు కాబట్టే ఓడిపోయాం.
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

**విశాఖ,మహానాడు:**

చంద్రబాబుయుడు నాయకత్వంలోని టీడీపీ ప్రభుత్వ విధానాలను మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశంసించారు. ప్రభుత్వం ఏర్పడి ఇంకా 20 రోజులే అయినందున, పనితీరుపై ఇప్పుడే తానేమీ స్పందించనన్నారు. నెలకు 4 వేల రూపాయల పెన్షన్ మంచినిర్ణయయమేనన్న బొత్స... గతంలో టీడీపీ ఆఫీసుపై వైసీపీ కార్యకర్తల దాడి తప్పేనన్నారు.

మీడియాతో మాట్లాడిన బొత్స ఇంకా ఏమన్నారంటే.. రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వటం మంచిదే. మిగిలిన హామీలను కూడా అమలు చేసే శక్తి వారికి రావాలని కోరుకుంటున్నా. వీసీల రాజీనామాలను ప్రభుత్వం కోరటం తప్పు కాదు. వైసీపీ కార్యాలయాల్లోకి కూటమి నేతలు చొరబడితే తప్పు. గతంలో టీడీపీ ఆఫీస్‌పై వైసీపీ నేతలు చేసిన దాడి కూడా తప్పు. ఉభయ పక్షాల వారు సంయమనం పాటించాలి. రాష్ట్ర విభజన వలన కలిగే నష్టం కంటే, జగన్ పాలన వల్లే నష్టం



ఎక్కువైందని అంటున్నారు. ఎప్పుడు నష్టం జరిగింది? ఎప్పుడు లాభం జరిగిందనేది లెక్కల్లో తేలుతుంది. ప్రజలు అంగీకరించలేదు కాబట్టే ఓడిపోయాం.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 01, జులై 2024

# తెలంగాణలో క్రికెట్‌కు కొత్త జోష్

- కొత్త స్టేడియం నిర్మాణంకు త్వరలో ప్రభుత్వంతో చర్చలు
- తొలి దశలో రెండు మూడు జిల్లా కేంద్రాల్లో స్టేడియాలు కట్టేందుకు చర్యలు
- క్రికెట్ ఆపరేషన్స్ హెడ్‌గా మాజీ పేసర్ వెంకటేష్ ప్రసాద్ నియామకంపై కసరత్తు
- పెండింగ్ ఆడిట్లకు మోక్షం
- బీసీసీఐ నుంచి నిధుల రాకకు లైన్‌క్లియర్
- ఈనెల 8 నుంచి డొమిస్టిక్ క్రికెట్ సీజన్ ప్రారంభం
- మహిళల లీగ్ క్రికెట్‌కు రూట్ మ్యాప్

హైదరాబాద్,మహానాడు: బీసీసీఐ సహకారంతో రాష్ట్రంలో క్రికెట్ సర్వతోముఖాభివృద్ధికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కొన్ని విప్లవాత్మక నిర్ణయాలను తీసుకుంది. ఆదివారం జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కార్యదర్శి దేవ్‌రాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, కౌన్సిలర్ సునిల్ అగర్వాల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ తెలంగాణ క్రికెటర్ల శ్రేయస్సు, ప్రగతిని దృష్టిలో పెట్టుకుని హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ హెడ్‌గా మాజీ పేసర్ వెంకటేష్ ప్రసాద్‌ను నియమించేందుకు ఆయనతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు తగ్గట్టు త్వరలో కొత్త అంతర్జాతీయ స్టేడియం నిర్మించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరపనున్నామని, సర్కార్ భూమిస్తే సులభంగా కట్టవచ్చు అన్నారు.

అలానే రెండు, మూడు జిల్లా కేంద్రాల్లోనూ స్టేడియాల నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నామని, టెండర్లు పిలిచి మహబూబ్ నగర్ స్టేడియంలో టర్ఫ్ వికెట్, నిజామాబాద్ స్టేడియంకు చుట్టు ఫెన్సింగ్ వేయనున్నామని తెలిపారు.



### జూలై 8 నుంచి డొమిస్టిక్ సీజన్ ప్రారంభం

ఈనెల 8 నుంచి డొమిస్టిక్ క్రికెట్ షెడ్యూల్ ప్రారంభమవనుందని కార్యదర్శి దేవ్‌రాజ్ చెప్పారు. అలానే మహిళల లీగ్ క్రికెట్‌ను కూడా ప్రారంభించేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మించే ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. కొత్త కోచ్‌లు, అంపైర్లు, గ్రౌండ్స్‌మెన్, స్కోరర్ల ఉద్యోగాల భర్తీ కూడా చేపట్టనున్నామని దేవ్‌రాజ్ తెలిపారు.

### పెండింగ్ ఆడిట్లకు మోక్షం

2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్లను ఆమోదించామని జగన్ మోహన్ రావు తెలిపారు. ఇవి బీసీసీఐకి పంపిస్తే, బీసీసీఐ నుంచి రావాల్సిన పెండింగ్ నిధులు కూడా రిలీజ్ అవుతాయని చెప్పారు. ఇక, పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఒక కమిటీని వేశామని, ఇందులో అపెక్స్ కౌన్సిల్ నుంచి ఒకరు, ఏజీ నుంచి ఒకరు, ఒక న్యాయవాది ఉంటారని చెప్పారు. వీరు విచారించి, బిల్లులు చెల్లింపులు చేస్తారని జగన్ మోహన్ రావు తెలిపారు.

# రాజకీయ నేతల గుప్పెట్లో బందీలయిన క్రీడాసంఘాలు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి విన్నవిస్తున్న క్రీడాకారులు

మంగళగిరి,మహానాడు: గత వై.ఎస్.ఆర్.సి.పి. ప్రభుత్వం హయాంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని రంగాలూ అధోగతి పాలయ్యాయి. క్రీడారంగం సైతం అస్తవ్యస్తంగా మారింది. రాష్ట్రంలో దారి తప్పిన వ్యవస్థలను దారిలో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధృడ సంకల్పంతో వడివడిగా అడుగులు వేస్తున్నారు.

ఈ నేపథ్యం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని అమితంగా ఇష్టపడే మేధావులు, ప్రముఖులు, వాణిజ్యవేత్తలు, క్రీడాకారులు పవన్ కళ్యాణ్‌ని కలుస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, ఢిల్లీకి చెందిన క్రీడాకారులు ఈ మధ్య కాలంలో కలిసిన వారిలో ఉన్నారు. ఇలా కలసినవారిలో ప్రముఖ క్రికెటర్ శ్రీ హనుమ విహారి కూడా ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో క్రీడారంగం అభివృద్ధికి దోహదపడే అనేక విషయాలను వారు ప్రస్తావించారు. క్రీడా సంఘాలు బాగుపడితేనే అత్యుత్తమ క్రీడాకారులు రూపొందుతారని దానికి సరైన మార్గదర్శనం చేసేవారు అవసరమని వారు పవన్ కళ్యాణ్ కి విన్నవించారు. క్రీడలతో సంబంధంలేని వారి చేతికి క్రీడా సంఘాలను అప్పగించవద్దని వారు ఆవేదనతో విన్నవించారు.

క్రికెట్‌లో అనుభవం ఉన్నవారికే క్రికెట్ సంఘం భాద్యతలు అప్పగించాలని, అలాగే కబడ్డీ ఆటపై పట్టు ఉన్నవారికే కబడ్డీ సంఘాన్ని అప్పగించాలని, ఇదే పద్దతి అన్ని సంఘాలలో అమలు చేస్తే ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో అగ్రగామిగా నిలుస్తుందని సూచించారు. సంఘాలలో జరుగుతున్న కొన్ని విషయాలను క్రీడాకారులు వివరించినప్పుడు పవన్ కళ్యాణ్ ఆవేదన చెందారు. కొన్ని క్రీడా సంఘాలు రాజకీయ ఉపాధి ఆవాస కేంద్రాలుగా మారిపోవడం వల్ల క్రీడాకారులకు ఇచ్చే సర్టిఫికేట్లు అంగడి సరుకుగా మారిపోయాయని తెలిపారు.



దానివల్ల ఎటువంటి క్రీడానుభవం లేనివారు క్రీడాకారుల కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో సీట్లు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడా సంఘాలలో తిష్టవేసిన రాజకీయ నాయకులు క్రీడాకారుల ఎంపికలో తమ బందువులు, సన్నిహితుల పిల్లలను వారి అధికార దర్పంతో ఎంపిక చేయిస్తున్నారనీ ఫలితంగా పోటీలలో వారు నిలబడలేక పోతున్నారని తమ బాధను వెలిబుచ్చారు.

క్రీడా సంఘాల నిధులు యధేచ్ఛగా దోపిడీకి గురవుతున్నాయనీ, క్రీడా సంఘాలలో క్రీడానుభవం లేని రాజకీయ నాయకులకు ప్రవేశం లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, ముఖ్యంగా క్రికెట్ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని వారు ముందుకు వచ్చారు.

క్రీడాకారుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు విన్న పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో చర్చిస్తానని వారికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్.డి.ఏ. ప్రభుత్వం క్రీడా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, క్రీడలకు వైభవాన్ని తప్పకుండా తీసుకు వస్తామని తనను కలిసిన క్రీడాకారులకు భరోసా ఇచ్చారు.




# పాలనలో ప్రణాళిక శాఖ పాత్ర కీలకం

- అర్థ గణాంక శాఖ డైరెక్టర్ దయానంద్ పదవీ విరమణ సభలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి

హైదరాబాద్,మహానాడు: రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ప్రణాళిక శాఖ పాత్ర కీలకం అని, ఈ శాఖ రూపొందించే గణాంకాలు, క్షేత్ర స్థాయి సర్వేలు రాష్ట్ర పాలనకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని అర్థ గణాంక శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఆ శాఖ డైరెక్టర్ దయానంద్ పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దయానంద్‌ను శాలువాతో సన్మానించి చిన్నారెడ్డి అభినందించి సన్మాన పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. అర్థగనాక గణాంక శాఖలో 35 సంవత్సరాల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న దయానంద్ దక్షతను గుర్తించి ప్రభుత్వంలో రానున్న రోజుల్లో తగిన గుర్తింపు దక్కుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ, అనుబంధ సంస్థల వివరాలు, భూముల గణాంకాలు, మనుషులు, పశు, పక్షుల సంపద, ప్రభుత్వ ఆస్తుల వివరాలు, జనాభా లెక్కలు సహా అనేక వివరాలు ప్రణాళికా శాఖ సేకరించి ప్రతి ఏటా ప్రచురణకు విడుదల చేస్తుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పరీక్షలకు సిద్ధం అయ్యే అభ్యర్థులకు ప్రణాళికా శాఖ ప్రచురణలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చిన్నారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చైర్మన్‌గా ఉన్న ప్రణాళికా సంఘం ప్రభుత్వ పాలనలో నూతన ఒరవడితో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతుందని చిన్నారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ చేస్తున్న ఆ శాఖ డైరెక్టర్ దయానంద్ ను ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

# మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఏలేటి

ఉట్నూర్,మహానాడు: ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ పార్లమెంటు సభ్యులు, బిజెపి నాయకులు రాథోడ్ రమేష్ హఠాన్మరణం విషయం తెలుసుకున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఉట్నూర్ కు వెళ్లి రమేష్ రాథోడ్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. రాథోడ్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మరణం బీజేపీకి తీరని లోటని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా, శాసనసభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి, గిరిజనుల అభ్యున్నతికి అండగా నిలిచారన్నారు. రమేష్ రాథోడ్ అకాలమరణం అందరిని కలచివేసిందన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పి ఓదార్చారు.



# ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు.. పోలవరం, అమరావతిపై దృష్టి

- సామాజిక సంక్షేమానికి మారుపేరు తెలుగుదేశం
- ఎన్టీఆర్ భరోసా పేరుతో రేపు పెనుమాకలో స్వయంగా సీఎం చంద్రబాబు పెన్షన్లు పంపిణీ
- అధికారంలోకి వచ్చిన వెంటనే 5 హామీలపై చంద్రబాబు సంతకం.. అమల్లోకి పథకాలు
- నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, స్కిల్ సెన్సెస్ తో ఉపాధి కల్పన
- వినతులతో టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తుతున్న జనం.. పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్
- పార్టీ ఆఫీసులపై దాడి చేసిన వారికి చట్టపరంగానే బుద్ధిచెబుతాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

మంగళగిరి,మహానాడు: సమాజిక సంక్షేమానికి టీడీపీ మారుపేరని.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు ఐదు సంతకాలు పెట్టారన్నారు. అందుకు అనుగుణంగానే చర్యలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడితే... చంద్రబాబు అభివృద్ధి సంక్షేమంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు.

పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలుగు దేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా నన్ను నియమించిన జాతీయ అధ్యక్షులు మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ముందుగా నా కృతజ్ఞతలు తెలుపుతున్న. నా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అభినందనలు తెలిపిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు హెచ్ఆర్డీ మంత్రి నారా



లోకేష్‌కి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి, మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఎంపీలందరికి నా కృతజ్ఞతలు. అలాగే యువనాయకత్వానికి, పార్టీ నేతలకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు నాకృతజ్ఞతలు.

శాసన సభ ఎన్నికల్లో మెజార్టీ ఓట్లతో నన్ను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెట్టిన నా గాజువాక ఓటరు దేవుళ్లకు నేను రుణపడి ఉంటా. టీడీపీ పార్టీ అంటే ఒక పవిత్రమైన ఆలోచనతో పెట్టిన పార్టి ఈ పార్టీలో ఉండటం అంటే గొప్పగా భావిస్తున్న. ఒక గోప్ప సంకల్పంతో అన్న ఎన్టీఆర్ పెట్టి పార్టీకి నేడు నేను రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టడం గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.

చంద్రబాబు ఎలక్షన్‌కు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వేంటనే అమలుచేస్తున్నారు. ఒకే విడతలో పింఛన్ రూ.1000 పెంచిన ముఖ్యమంత్రికి నా కృతజ్ఞతలు. మేని ఫెస్టో హామీ ప్రకారం చంద్రబాబు పింఛన్ రూ. 3000 ల నుండి 4 వేలకు ఒకే దఫా పెంచారు. ఏప్రిల్ నెల నుండి పెంచిన దానిని జత చేసి జులై 1న రూ.7 వేలు ఇవ్వడం దేశంలోనే రికార్డు. జగన్ ఖజానాను లూటీ చేసి రాష్ట్రాన్ని దివాళా తీయిస్తే... పేదల పెన్నిది చంద్రన్న వృద్ధులకు రూ.7 వేల పింఛన్ ఇస్తున్నారు. జగన్ విడతల వారి చేయడం వలన ఒక్కొక్క పింఛన్ దారునికి రూ.32వేలు నష్టపోయారు.

రేపు మంగళగిరి నియోజకవర్గం పెనుమాక గ్రమంలో సీఎం చంద్రబాబు నేరుగా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. అలాగే వారివారి నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పింఛన్ల పంపిణీలో భాగస్వామ్యం కావాలి. శవ రాజకీయాల కోసం ఎన్నికల సమయంలో అవ్వాతాతలను ఎండల్లో తిప్పి34 మంది మరణాలకు కారణమయ్యాడు జగన్.

పేదలకు కడుపు నింపేందుకు అన్నక్యాంటీన్ ఏర్పాటు, నిరుద్యోగులకోసం మెగా డీఎస్సీ, పింఛన్‌ల పెంపుపై చంద్రబాబు అధికారంలోకి వచచిన వెంటనే సంతకం పెట్టారు. పేదల ఆస్తులు కబ్జా కాకుండ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారు. యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ సెన్సెప్ పై సంతకం పెట్టారు.

రివర్స్ టెండర్ పేరుతో పోలవరంపై వైసీపీ చేసిన విధ్వంసంలో రూ. 70 వేల కోట్లు నష్టపోయాం. పక్క రాష్ట్రల ప్రయోజనాలకోసం పోలవరాన్ని గోదాట్లో ముంచాడు జగన్ రెడ్డి. త్వరగా పోలవరాన్ని పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశామలం చేస్తాం. అమరావతిని ఒక కులానికి అంటగట్టి విశాఖ రాజధాని పేరుతో దోచుకుని అమరావతిని నిర్వీర్యం చేశారు.


అమరావతి పూర్తి చేసి ప్రపంచంలో మేటైన రాజధానిగా తీర్చుదిద్దుతాం. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాం. అమరావతి ఒక కులానికి చెందిందికాదు ఎసీ, ఎస్టీలు, మైనార్టీలు అందరూ ఉన్నారు ఇక్కడ. మంత్రివర్గ విస్తర్ణలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం టీడీపీకి బీసీల పట్ల చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. అలాగే రాష్ట్ర డిజీపీ, టీటీడీ ఈఓ, సీఎం కార్యదర్శి బీసీలకు చెందిన వారే టీడీపీకి రాష్ట్ర అధ్యక్షుడిగా నన్ను నియమించారంటే బీసీలంటే చంద్రబాబకు ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నన్ను నియమించినందుకు బీసీ వర్గానికి వన్నె తెచ్చేలా నేను ముందుకు వెళ్తా.. చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని నిలబెడతా. సీఎంను కలిసేందుకు ఎక్కువ మంది ప్రజలు టీడీపీ కేంద్ర కార్యాలయానికి వస్తున్నారు. దీంతో సమస్యలపై వస్తున్న ప్రజలకు కాస్త ఇబ్బంది కలుగుతుంది కనుక వీరికి ఇబ్బంది కలుగకుండా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తున్నాం.

ఆ నెంబర్‌కు కాల్ చేస్తే వారికి ప్రయార్టీ కల్పించి సీఎంను కలిచే ఏర్పాటు చేస్తాం. నెంబర్ 7306299999కు కాల్ చేయాలి. 500 మంది గ్రివెన్స్‌కు హాజరయ్యేలా ఉంటే ప్రజలకు ఇబ్బంది ఉండదు. స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద పరిష్కారం కాని సమస్యలు ఉన్నప్పుడే టీడీపీ కేంద్ర కార్యాలయానికి వేస్తే మేలు. ఫోటోలు తీసుకోవడానికి వస్తున్న యువత, జనం వలన.. సమస్యలు కోసం వస్తున్న వారు కొందరు ఇబ్బంది పడుతున్నారు. అందుకే గ్రీవెన్స్ ను సక్రమంగా నిర్వహించేందుకు టోల్ నెంబర్ పెడుతున్నాం.

దురుద్దేశంతో టీడీపీ నేతలపై పెట్టిన కేసులను తొలగించేందుకు కృషి చేస్తున్న అదే నా ప్రధాన కర్తవ్యం. కోర్టుల్లో ఉన్న కేసులను సంవత్సరకాలంలో మాఫీ అయ్యేలా కృషి చేస్తా. కార్యకర్తలు సిద్ధాంతపరమైన ఆలోచనతో అధినాయకత్వం, యువనాయకత్వంపై నమ్మకంతో కూటమిని అధికారంలోకి తీసుకొచ్చారు. వారిపై ఉన్న కేసులను ప్రాధాన్యత పరంగా మూడు నెలల్లో తీయించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎవరైతే టీడీపీ కార్యాలయాలపై దాడి చేశారో.. చట్టాలు కాలరాశారో వారికి ప్రజాస్వామ్య బద్ధంగా బుద్ధి చెబుతాం..

## 7306299999 నెంబర్‌కు కాల్ చేస్తే సీఎంను కలవొచ్చు



ముఖ్యమంత్రిని కలిసేందుకు వచ్చేవారికి అధికార పార్టీ నేతలు కీలక సూచనలు చేశారు. తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రజల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌కు రూపొందించారు. ప్రజలు తమ సమస్యలు తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 7306299999ను సంప్రదించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెంబర్‌కు వచ్చిన ఫిర్యాదును పరిశీలించి, ముఖ్యమంత్రి వద్దకు పంపిస్తారని పేర్కొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 01, జులై 2024




## ఉపాధి హామీ బకాయిలను విడుదల చేయండి

- హైకోర్టు ఆదేశించినా బిల్లులివ్వలేదు
- చంద్రబాబుకి రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి

అమరావతి,మహానాడు:

గతంలో చేసిన ఉపాధి హామీ పనుల బకాయి బిల్లులను చెల్లించేలా ఆదేశించాలని మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు బాబూ రాజేంద్రప్రసాద్ సీఎం చంద్రబాబునాయుడును కోరారు. ఆ మేరకు బాబును కలిసిన ఆయన.. 2018– 19 సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ పనుల పాత బకాయిలను చెల్లించాలని, అలాగే ఆ బకాయిలు చెల్లించాలని అధికారులకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా కూడా బిల్లులు ఇవ్వకుండా జాప్యం చేసిన అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించి..



త్వరలోనే బిల్లులు చెల్లించడమే కాకుండా, చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

# అరకు కాఫీ అద్భుతం..

- మీరూ అరకు కాఫీని ఆస్వాదించండి
- మోదీ 'మన్‌కీ బాత్'లో చంద్రబాబు ప్రస్తావన
- వికసిత భారత దేశం కోసం ప్రయత్నాలు
- మనందరి జీవితాల్లో 'అమ్మ'కు అత్యున్నత స్థానం
- 'అమ్మ పేరుపై ఒక చెట్టు
- భూమాత మనందరి జీవితాలకు ఆధారం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- 2024వ సంవత్సరం జూన్ 30 వ తేదీన జరిగిన 'మన్ కీ బాత్' (మనసు లో మాట) కార్యక్రమం యొక్క 111వ భాగంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం పాఠం..

*నా ప్రియమైన దేశ ప్రజలారా..!*
*నమస్కారం..*

ఇప్పుడు రుతు పవనాలు కూడా వచ్చాయి. రుతు పవనాలు వస్తే మనసు కూడా ఆనందంగా ఉంటుంది. తమ పని ద్వారా సమాజంలో, దేశంలో మార్పు తీసుకు వస్తున్న దేశ ప్రజల గురించి ఈ రోజు నుండి మరోసారి 'మన్ కీ బాత్' లో మనం చర్చిస్తాం. మన సుసంపన్న సంస్కృతి గురించి, మహి మాన్విత చరిత్ర గురించి మాట్లాడుకుంటాం. వికసిత భారత దేశం కోసం ప్రయత్నాలను చర్చిస్తాం.. ఫిబ్రవరి నుండి ఇప్పటి వరకు నెలలో చివరి ఆదివారం వచ్చినప్పుడల్లా నేను మీతో ఈ సంభాషణను కోల్పోయినట్టు భావించాను. కానీ ఈ నెలల్లో మీరు నాకు లక్షలాది సందేశాలు పంపడం చూసి నేను చాలా సంతో



షించాను.

ఈ రోజు జూన్ 30వ తేదీ చాలా ముఖ్యమైన రోజు. మన ఆదివాసీ సోదర సోదరీమణులు ఈ రోజును 'హూల్ దినోత్సవం'గా జరుపుకుంటారు. ఈ రోజు పరాయి పాలకుల దౌర్జన్యాలను తీవ్రంగా వ్యతిరేకించిన పరాక్రమ శాలులు సిద్ధో– కాన్హుల తిరుగులేని ధైర్యంతో ముడిపడి ఉంది. ధైర్యవంతులైన సిద్ధో– కాన్హు వేలాది మంది సంథాలీ సహచరులను ఏకం చేసి, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఇది ఎప్పుడు జరిగిందో మీకు తెలుసా..? ఇది 1855లో జరిగింది. అంటే 1857లో జరిగిన భారత దేశ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి రెండేళ్ల ముందన్నమాట.

జారండ్‌లోని సంథాల్ పరగణాలో మన ఆదివాసీ సోదర సోదరీమణులు విదేశీ పాలకులకు వ్యతిరేకంగా అప్పుడు ఆయుధాలు చేపట్టారు. ఆ కాలంలో బ్రిటిష్ వారు మన సంథాలీ సోదర సోదరీమణులపై అనేక అఘాయిత్యాలకు పాల్పడ్డారు. వారిపై అనేక ఆంక్షలు కూడా విధించారు. ఈ పోరాటంలో అద్భుతమైన ధైర్య సాహసాలు ప్రదర్శించిన వీరులు సిద్ధో, కన్హూ వీర మరణం పొందారు. జార?ండ్ నేల లోని ఈ అమర పుత్రుల త్యాగం ఇప్పటికీ దేశప్రజలకు స్ఫూర్తినిస్తుంది..

ప్రపంచంలో అత్యంత విలువైన సంబంధం ఏది అని నేను మిమ్మల్ని అడిగితే మీరు ఖచ్చితంగా 'అమ్మ' అని చెప్తారు. మనందరి జీవితాల్లో 'అమ్మ'కు అత్యున్నత స్థానం ఉంది. దుఃఖాన్ని భరించి కూడా తల్లి తన బిడ్డను పోషిస్తుంది. ప్రతి తల్లి తన బిడ్డపై ప్రేమను చూపిస్తుంది. జన్మనిచ్చిన తల్లి ప్రేమ రుణం లాంటిది. దీన్ని ఎవరూ తీర్చుకోలేరు. అమ్మకి మనం ఏమీ ఇవ్వలేం. కానీ ఇంకేమైనా చేయగలమా అని ఆలోచించాను.

దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమం పేరు – 'ఏక్ పేడ్ మా కే నామ్'– 'అమ్మ పేరుపై ఒక చెట్టు'. మా అమ్మ పేరు మీద నేను కూడా ఒక చెట్టు నాటాను. దేశ ప్రజలందరికీ– ప్రపంచం లోని అన్ని దేశాల ప్రజలందరికీ నేను ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. వారి తల్లితో కలిసి లేదా ఆమె పేరు మీద ఒక చెట్టు నాటాలనేది ఆ విజ్ఞప్తి.

తల్లి జ్ఞాపకార్థం లేదా ఆమె గౌరవార్థం మొక్కలు నాటాలనే ప్రచారం వేగంగా జరగడం చూసి నేను చాలా సంతోషంగా ఉన్నాను. ప్రజలు తమ తల్లితో కలిసి లేదా ఆమె ఫోటోతో చెట్లను నాటుతున్న చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి కోసం మొక్కలు నాటుతున్నారు. వారు ధనికులు కావచ్చు. పేద వారు కావచ్చు. ఉద్యోగం చేసే మహిళ కావచ్చు. లేదా గృహిణి కావచ్చు. ఈ ఉద్యమం ప్రతి ఒక్కరికీ తమ తల్లి పట్ల ఉన్న ప్రేమను వ్యక్తీకరించడానికి సమాన అవకాశాన్ని కల్పించింది. అమృత మహోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా 60 వేలకు పైగా అమృత సరోవరాలను కూడా నిర్మించారు. ఇకపై కూడా అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి.

దేశంలోని వివిధ ప్రాంతాలకు రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ వర్షాకాలంలో అందరూ తమ ఇంట్లో వెతుకులాట ప్రారంభించిన వస్తువు 'గొడుగు'.. ఈ రోజు 'మన్ కీ బాత్'లో నేను మీకు ప్రత్యేకమైన గొడుగుల గురించి చెప్పాలను కుంటున్నాను. ఈ గొడుగులు మన కేరళలో తయారు చేస్తారు. నిజానికి కేరళ సంస్కృతిలో గొడుగులకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. కేరళలోని ఒక చిన్న గ్రామం నుండి బహుళ జాతి కంపెనీల వరకు కార్థుంబీ గొడుగులు తమ ప్రయాణాన్ని పూర్తి చేస్తున్నాయి. స్థానిక ఉత్పత్తులకు ప్రచారం కల్పించడానికి ఇంతకంటే మంచి ఉదాహరణ ఏముంటుంది?

వచ్చే నెలలో ఈ సమయానికి ప్యారిస్ ఒలింపిక్స్ ప్రారంభ



మవుతాయి. ఒలింపిక్ క్రీడల్లో భారత ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు మీరందరూ కూడా ఎదురు చూస్తారని నేను ఖచ్చితంగా భావిస్తున్నాను. ఒలింపిక్ క్రీడల్లో పాల్గొంటున్న భారత జట్టుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. టోక్యో ఒలింపిక్స్ జ్ఞాపకాలు ఇప్పటికీ మనందరి మదిలో మెదులుతూనే ఉన్నాయి.

ఈ రేడియో కార్యక్రమం విని మీరు కూడా ఆశ్చర్య పోయారు కదా..!? రండి.. దీని వెనుక ఉన్న మొత్తం కథను మీకు చెప్తాను. ఇప్పుడు మనం కువైట్ గురించి మాట్లాడు కుంటున్నామని మీరు అనుకుంటారు. అక్కడికి హిందీ ఎలా వచ్చింది..? వాస్తవానికి కువైట్ ప్రభుత్వం తన జాతీయ రేడియోలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అది కూడా హిందీలో. 'కువైట్ రేడియో' లో ప్రతి ఆదివారం అరగంట పాటు ఈ కార్యక్రమం ప్రసారమవుతుంది.

ఇందులో భారతీయ సంస్కృతికి సంబంధించిన విభిన్న అంశాలు ఉన్నాయి. కళా ప్రపంచానికి సంబంధించిన మన సినిమాలు, చర్చలు అక్కడి భారతీయ సమాజంలో బాగా ప్రాచుర్యం పొందాయి. కువైట్ స్థానిక ప్రజలు కూడా దీనిపై చాలా ఆసక్తి చూపు తున్నారని నాకు తెలిసింది. ఈ అద్భుతమైన చొరవ ప్రదర్శించినందుకు కువైట్ ప్రభుత్వానికి, ప్రజలకు నేను హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను..

నేడు ప్రపంచ వ్యాప్తంగా మన సంస్కృతిని కీర్తిస్తున్న తీరు పట్ల ఏ భారతీయుడు సంతోషించకుండా ఉండగలడు..? ఉదాహరణకు తుర్క్‌మెనిస్తాన్‌లో ఈ సంవత్సరం మే లో అక్కడి జాతీయ కవి 300వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రపంచంలోని 24 మంది ప్రముఖ కవుల విగ్రహాలను తుర్క్ మెనిస్తాన్ అధ్యక్షుడు ఆవిష్కరించారు.

ఈ విగ్రహాలలో ఒకటి గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ది కావడం విశేషం. ఇది గురు దేవుడికి గౌరవం. భారత దేశానికి గౌరవం. అదే విధంగా జూన్ నెలలో రెండు కరేబియన్ దేశాలు సూరినామ్, సెయింట్ విన్సెంట్ అండ్ గ్రెనడిన్స్ తమ భారతీయ వారసత్వాన్ని పూర్తి ఉత్సాహంతో, ఉల్లాసంతో జరుపుకున్నాయి.

సూరినామ్‌లోని భారతీయ సమాజం ప్రతి సంవత్సరం జూన్ 5వ తేదీని ఇండియన్ అరైవల్ డేగా, ప్రవాస భారతీయుల దినోత్సవంగా జరుపుకుంటుంది. అక్కడ హిందీతో పాటు భోజ్‌పురి కూడా ఎక్కువగా మాట్లాడతారు. సెయింట్ విన్సెంట్ అండ్ గ్రెనడిన్స్‌లో నివసిస్తున్న భారతీయ సంతతికి చెందిన మన సోదర సోదరీమణులు దాదాపు ఆరు వేల మంది ఉంటారు. వారందరూ తమ వారసత్వం గురించి చాలా గర్వ పడుతున్నారు.

జూన్ 1వ తేదీన వారందరూ ఇండియన్ అరైవల్ డే ని ఘనంగా జరుపుకున్న విధానంలో ఈ భావన స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. భారతీయ వారసత్వం, సంస్కృతులకు సంబంధించిన అటువంటి విస్తరణ ప్రపంచ వ్యాప్తంగా కనిపించినప్పుడు ప్రతి భారతీయుడూ గర్వ పడుతున్నాడు.

ఈ నెల యావత్ ప్రపంచం 10వ యోగా దినోత్సవాన్ని ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకుంది. జమ్ముకశ్మీర్ లోని శ్రీనగర్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో నేను కూడా పాల్గొన్నాను.

సౌదీ అరేబియాలో మొదటిసారిగా ఒక మహిళ అల్ హనౌఫ్ సాద్ ఉమ్మడి యోగా సాధన కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఒక సౌదీ మహిళ ప్రధాన యోగా సెషన్‌ను నిర్వహించడం ఇదే మొదటిసారి..

ఈసారి యోగా దినోత్సవం సందర్భంగా ఈజిప్టులో ఫోటోల పోటీ నిర్వహించారు. నైలు నది తీరం వెంబడి, ఎర్ర సముద్రం బీచ్ లలో, పిరమిడ్‌ల ముందు లక్షలాది మంది యోగా సాధన చేస్తున్న చిత్రాలు బాగా ప్రాచుర్యం పొందాయి.

యోగా దినోత్సవంలో పాల్గొన్న మిత్రులందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను. గతం నుండి నేను మిమ్మల్ని కోరుకుంటున్న విషయం ఒకటుంది. మనం యోగాను ఒక్కరోజు మాత్రమే సాధన చేసి ఆపేయ కూడదు. క్రమం తప్పకుండా యోగా చేయాలి. ఫలితంగా మీరు ఖచ్చితంగా మీ జీవితంలో సానుకూల మార్పులను అనుభవిస్తారు..

భారత దేశానికి చెందిన అనేక ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా చాలా డిమాండ్ ఉంది. భారత దేశ స్థానిక ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తం కావడం చూసినప్పుడు గర్వంతో నిండి పోవడం సహజం. అటువంటి ఒక ఉత్పత్తి అరకు కాఫీ..

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతా రామరాజు జిల్లాలో అరకు కాఫీ భారీ స్థాయిలో ఉత్పత్తి అవుతుంది. ఇది గొప్ప రుచికి, సువాసనకు ప్రసిద్ధి చెందింది. అరకు కాఫీ సాగులో దాదాపు ఒకటిన్నర లక్షల ఆదివాసీ కుటుంబాలు నిమగ్నమై ఉన్నాయి.

అరకు కాఫీ ఖ్యాతి కొత్త శిఖరాలకు చేరడంలో గిరిజన సహకార సంఘం ప్రధాన పాత్ర పోషించింది. అక్కడి రైతు సోదర సోదరీ మణులను ఏకతాటి పైకి తీసుకొచ్చి, అరకు కాఫీ సాగు చేసేలా ప్రోత్సహించింది. దీంతో ఈ రైతుల ఆదాయం కూడా బాగా పెరిగింది. కొండ దొర ఆదివాసీ సమాజం కూడా దీని వల్ల ఎంతో లబ్ధి పొందింది. సంపాదనతో పాటు గౌరవ ప్రదమైన జీవితాన్ని కూడా వారు పొందుతున్నారు.

ఒకసారి విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఈ కాఫీని రుచి చూసే అవకాశం నాకు లభించిందని గుర్తుంది. దాని రుచి గురించి అడగవలసిన అవసరమే లేదు..! ఈ కాఫీ అద్భుతమైంది..! అరకు కాఫీకి అనేక అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. ఢిల్లీలో జరిగిన జి–20 శిఖరాగ్ర సమ్మేళనం లోనూ కాఫీ మాధుర్యాన్ని అతిథులు రుచి చూశారు. మీకు అవకాశం దొరికినప్పుడల్లా అరకు కాఫీని కూడా ఆస్వాదించండి..

మన జమ్మూ కశ్మీర్ ప్రజలు కూడా స్థానిక ఉత్పత్తులను ప్రపంచ వ్యాప్తం చేయడంలో వెనుకబడి లేరు. జమ్మూ కశ్మీర్‌లో గత నెలలో చేసిన పనులు దేశ వ్యాప్తంగా ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

అక్కడి పుల్వామా నుంచి లండన్‌కు మంచు బఠానీల మొదటి సరుకును పంపారు. కాశ్మీర్‌లో పండే విలక్షణమైన కూరగాయలను ప్రపంచ పటంలోకి ఎందుకు తీసుకు రాకూడదనే ఆలోచన కొంత మందికి వచ్చింది. అప్పుడు చకూరా గ్రామానికి చెందిన అబ్దుల్ రషీద్ మీర్ ఇందుకు ముందుగా ముందుకు వచ్చారు. గ్రామంలోని ఇతర రైతుల భూమితో సమష్టిగా మంచు బఠానీలను పండించే పనిని ప్రారంభించారు. త్వరలో కశ్మీర్ నుండి మంచు బఠానీలు లండన్ కు పంపడం మొదలుపెట్టారు. ఈ విజయం జమ్మూ కాశ్మీర్ ప్రజల సమృద్ధికి కొత్త ద్వారాలు తెరిచింది.

ఈ రోజు జూన్ 30వ తేదీన ఆకాశవాణి సంస్కృత బులెటిన్ ప్రసారం ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తవుతోంది. ఈ బులెటిన్ చాలా మందిని 50 సంవత్సరాలుగా సంస్కృతంతో నిరంతరం అనుసంధానించింది. నేను ఆకాశవాణి కుటుంబాన్ని అభినందిస్తున్నాను..

ప్రాచీన భారతీయ విజ్ఞానంలో, వైజ్ఞానిక పురోగతిలో సంస్కృతం ముఖ్య పాత్ర పోషించింది.. మనం సంస్కృతానికి గౌరవం ఇవ్వడం, సంస్కృతాన్ని మన దైనందిన జీవితంతో అనుసంధానించడం నేటి కాలానికి అవసరం..

ప్రస్తుతం బెంగళూరులో చాలా మంది ఇలాంటి ప్రయత్నం చేస్తున్నారు. బెంగళూరులో 'కబ్బన్ పార్క్' అనే పేరుతో ఒక పార్కు ఉంది. అక్కడి ప్రజలు ఆ పార్కులో కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. అక్కడ వారానికి ఒకసారి– ప్రతి ఆదివారం– పిల్లలు, యువకులు, పెద్దలు పరస్పరం సంస్కృతంలో మాట్లాడుకుంటారు. అంతే కాదు– అక్కడ అనేక చర్చా సమావేశాలను సంస్కృతంలో మాత్రమే నిర్వహిస్తారు.

వారి ఈ చొరవకు పెట్టుకున్న పేరు – సంస్కృత వారాంతం..! దీన్ని సమష్టి గుబ్బి గారు వెబ్ సైట్ ద్వారా ప్రారంభించారు. కొద్దిరోజులక్రితం ప్రారంభమైన ఈ ప్రయత్నం బెంగుళూరు ప్రజలలో చాలా త్వరగా ప్రాచుర్యం పొందింది. మనమందరం అలాంటి ప్రయత్నంలో పాలు పంచుకుంటే ప్రపంచంలోని ఈ పురాతన, శాస్త్రీయ భాష నుండి మనం చాలా విషయాలు నేర్చుకోవచ్చు.

# వైసీపీ కోసం అరెస్ట్ కాదు.. ప్రాణ త్యాగానికైనా సిద్ధం

- లోక్ సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా
- ఎంపీ మిథున్ రెడ్డి

తిరుపతి,మహానాడు:

వైసీపీ కోసం అరెస్ట్ కాదు.. ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. "ఫలితాల తర్వాత మా కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారి ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. మా వారిని పరామర్శించేందుకు వెళ్తున్న నన్ను అడ్డగిస్తున్నారు. ఎంపీగా నాకు ఉన్న అర్హత అడ్డుకుంటున్నారు. పోలీసులు నన్ను వెళ్లద్దంటున్నారన్నారు. దీనిపై లోక్ సభ స్పీకర్ కు ఫిర్యాదు చేస్తాను" అని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం పుంగనూరు అసెంబ్లీ, రాజంపేట పార్లమెంట్ పరిధిలో భౌతిక దాడులకు టిడిపి పాల్పడుతోంది. ఇది చాలా దారుణమైన పరిస్థితి పుంగనూరు లో ఎప్పుడు లేని కొత్త సంస్కృతికి తెర లేపుతున్నారు. జేసిబీలు తెచ్చి పేదల ఇల్లు కులదోస్తున్నారు.

ఎన్నికల సమయంలో రాజకీయంగా పోరాడితే అందరం స్వాగతిస్తాం, కానీ పేదల ఇళ్లపై దాడులు చేయడం దారుణం.ఫ్యాక్షన్ నియోజకవర్గాల్లో పరిస్థితి ఈరోజు పుంగనూరులో ఉంది. మా వారిని పరామ



ర్శించడానికి వెళుతుంటే పోలీసులు అడ్డుకున్నారు. నా నియోజకవర్గంలో నన్ను పర్యటించకుండా అడ్డుకుంటున్నారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. మాకు ఓటు వేసిన 40 శాతం మందిని రాష్ట్రం నుండి తరిమేస్తారా ? వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు మేము అండగా ఉంటాం. పార్టీ మారమని మా కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఒత్తిడి చేసి, ప్రలోభాలు చేయడం ద్వారా పార్టీలు మార్పిస్తే లాభం లేదు.

ఇన్ని గొడవల నేపథ్యంలో ఎలక్ట్రిక్ బస్సుల ఫ్యాక్టరీ యాజమాన్యం సందిగ్ధంలో పడింది. భవిష్యత్తులో పుంగనూరులోకి ఏ పరిశ్రమలు రాకుండా ఇలాంటి చర్యలకు పాల్పడ్డారు. నేను బిజెపి కి వెళ్తున్నానని బుద్ధి లేని వారు ప్రచారం చేస్తున్నారు. చల్లా బాబును అనేక సంవత్సరాల నుండి చూస్తున్న. ఇలాంటివి ఎప్పుడు లేవు. చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దు అని చల్లా బాబుకు సలహా ఇస్తున్న పోలీసులపై దాడి చేసి చల్లా బాబు జైలుకి వెళ్ళారు. మంత్రి పదవి భద్రపరుచుకోవడం కోసం రాంప్రసాద్ కూడా మాపై అనేక విమర్శలు చేస్తున్నారు.

# అయోధ్య నుంచి కొండగట్టుకు రాముడి బాణం

- అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

(వెంకట్)



**జగిత్యాల:** అయోధ్య బాల రాముడి కోసం బంగారం, వెండి మిశ్రమాలతో ప్రత్యేకంగా తయారు చేసిన బాణం ఈ రోజు ఉదయం కొండగట్టుకు చేరుకుంది. దేశవ్యాప్తంగా ప్రముఖ ఆలయాలకు ఈ బాణాన్ని తీసుకెళుతూ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అంజన్న సన్నిధికి చేరింది. నిజామాబాద్‌కు చెందిన శ్రీనివాస శర్మ అనే భక్తుడు బాల రాముడి కోసం ఈ బాణాన్ని తయారు చేయించాడు.

ఈ బాణాన్ని దేశంలోని ప్రముఖ ఆలయాలను సందర్శింప జేసి చివరగా అయోధ్యకు తీసుకు వెళ్లి బాల రాముడికి సమర్పిస్తామని శ్రీనివాస్ శర్మ తెలిపాడు. ప్రస్తుతం ఈ బాణానికి కొండగట్టు అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపాడు. కార్యక్రమంలో ఈవో చంద్ర శేఖర్, ప్రధాన అర్చకుడు జితేంద్ర ప్రసాద్, స్థానచార్యుడు కపిందర్, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవి, భక్తులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
6
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 01, జులై 2024

# సంపద సృష్టించడం అంటే ఇదేనా?

- 7,000 కోట్ల నుంచి రూ. 10,000 కోట్లకు అప్పులు
- సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు
- రైతులకు సాయం ఎప్పుడు చేస్తారు?
- వైఎస్ఆర్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి కె.రవిచంద్రారెడ్డి



ఢిల్లీ,మహానాడు:

ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరి మరో నాలుగు రోజుల్లో నెల రోజులు పూర్తి కావొస్తుంది. టెక్నికల్‌గా జులై 12కు నెల రోజులవుతుంది. చంద్రబాబు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తు న్నారు. రేపు పెన్షన్స్ కోసం కొంత వెసులుబాటు ప్రయత్నాలు చేస్తున్నారు.

మేం సంపద సృష్టిస్తాం, అప్పులు చేయమని అధికారంలోకి వచ్చిన మీరు మూడు వారాల్లోనే రూ. 7000 కోట్ల నుంచి రూ. 10,000 కోట్లకు అప్పులు తెచ్చేందుకు ఏర్పాట్లు చేశారు, మరి సంపద సృష్టించడం అంటే ఇదేనా?

సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంపద సృష్టిస్తామన్న మాట మీద నిలబడండి, మీ హామీల అమలుకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. లబ్ధిదారులందరికీ అన్ని సంక్షేమ పథకాలు అమలుచేయాలని కోరుతున్నాం

రేపు ఇచ్చే పెన్షన్లు వలంటీర్లతో కాకుండా సచివాలయ ఉద్యోగులతో ఇస్తున్నారు కదా ఇది రేపు ఒక్క రోజుకేనా లేక పూర్తిగా ఇదే పద్ధతి కొనసాగిస్తారా? మరి వలంటీర్లకు రూ. 5000 కు బదులు రూ. 10,000 గౌరవ వేతనం ఇస్తామన్నారు కదా, మరి వారిని ఏం చేస్తారు, అమ్మ ఒడిని తల్లికి వందనం పేరుతో ఇస్తామన్నారు కదా మరి స్కూల్స్ ప్రారంభమయ్యాయి, మరి ఎప్పుడు ఇస్తున్నారు.

కేంద్రం నుంచి రైతులకు రైతు భరోసా సాయం అందింది, మరి మీరిచ్చిన మాట ప్రకారం రైతులకు సాయం ఎప్పుడు చేస్తారు తేదీ ప్రకటించండి.

మీరు వైఎస్ఆర్‌సీపీ కార్యాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం, ఆస్తుల విధ్వంసం ఎంతవరకు సమంజసం, మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా జనరంజక పాలన చేయాలి కానీ ఇలా దాడులు చేయడం సరికాదు. ఇలాంటి అరాచకాలకు ఫుల్ స్టాప్ పెట్టి ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై మీరు దృష్టిసారిం చాలని కోరుతున్నాం.

# కాంగ్రెస్‌లోకి ఇద్దరు ఎమ్మెల్సీలు?

- 'కారు' దిగి కాంగ్రెస్ చేరనున్న బస్వరాజు సారయ్య, బండ ప్రకాష్?
- బీఆర్ఎస్‌కు మరో బిగ్ షాక్

హైదరాబాద్, మహానాడు:
వరంగల్ టీఆర్ఎస్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ హయాంలో ఆ పార్టీ నుంచి ఎమ్మెల్సీలుగా ఎన్నికైన బస్వరాజు సారయ్య, బండ ప్రకాష్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. గతంలో వీళ్లు కాంగ్రెస్‌లోనే పనిచేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సారయ్య మంత్రిగా కూడా పనిచేశారు.





# పోలవరంపై అంతర్జాతీయ నిపుణుల అధ్యయనం

పోలవరం,మహానాడు:

పోలవరం ప్రాజెక్టు ఎందుకు నిలిచిపోయింది. ప్రాజెక్టు నిర్మాణంలో అడ్డంకులు ఏమిటి? పనులను తిరిగి ఎలా ప్రారంభించాలి అనే అంశాలపై అంతర్జాతీయ నిపుణుల బృందం పరిశీలిస్తోంది. 4 రోజుల పర్యటనలో భాగాంగా కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలించిన అనంతరం, పనుల పురోగతిపై నివేదిక ఇవ్వనున్నారు.

పోలవరంలో కీలక సాంకేతిక సవాళ్లను పరిష్కరించేందుకు అంతర్జాతీయ జలవనరుల నిపుణుల బృందం ప్రాజెక్టును పరిశీలిస్తోంది. అమెరికా, కెనడాల నుంచి 4 గురు నిపుణులు వచ్చారు. కేంద్ర, రాష్ట్ర జలనరుల శాఖ అధికారులతో నిన్న దిల్లీలో నిపుణులు బృందం సమావేశం అయ్యారు. అనంతరం రాత్రి రాజమండ్రికి చేరుకున్న నిపుణులు, పోలవరం ప్రాజెక్టు వద్ద అధికారులతో భేటీ అనంతరం ప్రాజెక్ట్ సైట్ను పరిశీలిస్తున్నారు.

అధికారులను అడిగి ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటు న్నారు. కెనడాకు చెందిన నలుగురు నిపుణులు శనివారం దిల్లీకి చేరుకున్నారు. నేటి నుంచి వారు పోలవరంలో తమ పని ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ నిపుణులు అక్కడే ఉంటారు. మొదటి రెండ్రోజుల పాటు ప్రాజెక్టును పూర్తిగా పరిశీలిస్తారు. ప్రతి కట్టడాన్ని క్షుణ్ణంగా పరిశీలించేలా పర్యటన షెడ్యూల్ సిద్ధమైంది. ఆ తర్వాత మరో రెండ్రోజుల పాటు సమస్యలను పరిష్కారాలపై మేధోమథనం చేయనున్నారు. ఇందులో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముఖ్యులు, కేంద్ర జలసంఘం నిపుణులు, సీఎస్ఎంఆర్ఎస్ సంస్థ ప్రతినిధులు, వ్యాప్కోస్, బావర్, కెల్లర్, మేఘా కంపెనీ ప్రతినిధులు, అంతర్జాతీయ డిజైన్ సంస్థ అఫ్రి ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. ఆ తర్వాత నైపుణ్య ఏజె న్సీలు, నిపుణులతో అంతర్జాతీయ నిపుణుల బృందం చర్చించనున్నారు.

## అంతర్జాతీయ స్థాయి నిపుణులు:

పోలవరం ప్రాజెక్టులో ఏర్పడ్డ అనిశ్చిత పరిస్థితులు, పెను సవాళ్ల పరిష్కారానికి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం అవసరమని కేంద్ర జలసంఘం నిర్ణయించిన క్రమంలో ఈ అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా డిజైన్లను రూపొందించేందుకు అంతర్జాతీయ డిజైన్ ఏజెన్సీ అఫ్రి సాయం తీసుకుంటున్నారు. వీరికి తోడు అమెరికాకు చెందిన డేవిడ్ బి పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో, సీస్ హించ్‌బెర్గర్, కెనడాకు చెందిన రిచర్డ్ డోన్నెల్లీలు నియమితులయ్యారు. పోలవరం ప్రాజెక్టులో సవాళ్లకు సంబం ధించిన కీలక అంశాల్లో వీరంతా నిపుణులు. అంతర్జాతీయ డ్యాం భద్రత నైపుణ్యం, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, స్ట్రక్చరల్ సొల్యూషన్స్, సివిల్ ఇంజినీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, జియో టెక్నికల్ ఇంజి నీరింగ్ వంటి అంశాల్లో వీరికి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం ఉండటంతో వీరిని ఎంచుకున్నట్లు కేంద్ర జలసంఘం పేర్కొంటోంది.

## ఎగువ కాఫర్ డ్యాం సందర్శనతో పర్యటన మొదలు:

నిపుణులు నేడు కొద్దిసేపు అధికారులతో మాట్లాడతారు. తర్వాత ప్రాజెక్టులోని ఎగువ కాఫర్ డ్యాం సందర్శనతో వీరి పర్యటన ప్రారంభమవుతుంది. ఆయా కట్టడాలు, నిర్మాణాలు పరిశీలించే క్రమంలో వాటికి సంబంధించిన డిజైన్లు, నిర్మాణ షెడ్యూల్, అధ్యయనాల నివేదికలు, నిర్మాణ క్రమం సందర్భంగా



తీసిన ఫోటోలు వారికి అందించేందుకు పోలవరం అధికారులు తగు ఏర్పాట్లను చేశారు. ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణ క్రమంపై ఫొటోలతో రిపోర్టును సమర్పించనున్నారు.

2018వ సంవత్సరంలో ఈ డ్యాం భద్రతకు సంబంధించి విశ్లేషణల నివేదిక, ఎగువ కాఫర్ డ్యాం సీపేజీపై ప్రొఫెసర్ రాజు 2021లో ఇచ్చిన నివేదికలు, 2022, 2023లలో ఫీజోమీటర్ల సాయంతో సీపేజీపై జరిపిన విశ్లేషణలు, 2024 జనవరిలో సీఎస్ఎంఆర్ఎస్ సమర్పించిన రిపోర్టు, కొత్తగా వచ్చిన అఫ్రి సంస్థ జియో టెక్నికల్ పరిశోధనలకు సంబంధించిన వివరాలు అంతర్జాతీయ నిపుణుల బృందానికి అందిస్తారు. తర్వాత దిగువ కాఫర్ డ్యాంను దాదాపు గంటన్నర పాటు పరిశీలించేలా షెడ్యూల్ రూపకల్పన చేశారు. ఈ సీపేజీ రిపోర్టులూ వారికి అందిస్తారు.

## రెండో రోజు మొత్తం అక్కడే:

ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతాలు, డయాఫ్రం వాల్ విధ్వంసం పరిశీలన, అగాధాలు, అక్కడ భూభౌతిక పరిస్థితుల మార్పునకు చేస్తున్న ప్రయత్నాలు తదితర అంశాలపై నిపుణుల బృందం ఎక్కువగా ఫోకస్ చేయనున్నారు. తొలి రోజు రెండు గంటల పాటు అక్కడే ఉండటంతో పాటు రెండో రోజు మొత్తం ఇందుకే కేటాయిస్తారు. ప్రస్తుతం పోలవరంలో ప్రధాన సవాళ్లన్నీ ఇక్కడే ఉండటంతో, రెండు గంటల పాటు ప్రధాన డ్యాం నిర్మించాల్సిన మొదటి గ్యాప్ ప్రాంతాన్ని నిపుణులు పరిశీలిస్తారు.

ఇప్పటికే అక్కడ కొంత వరకూ పని జరిగింది. ఎడమ వైపున అక్కడ నిర్మించిన డయాఫ్రం వాల్‌ని సైతం పరిశీలిస్తారు. జియ లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) నివేదికలను సమర్పిస్తారు. 2020 దిల్లీ ఐఐటీ ఇచ్చిన రిపోర్టును, అగాధాలు ఏర్పడ్డ ప్రాంతాల్లో వైబ్రో కాంపాక్షన్ పనులు, వాటిపై అధ్యయన పత్రాలు, డయాఫ్రం వాల్‌పై ఎన్‌హెచ్‌పీసీ నివేదికలు అందిస్తారు. తర్వాత రెండు రోజులలో నిపుణులు, అధికారులతో చర్చించనున్నారు.

# ముచ్చటగా మూడో పెళ్లి

- ఇంటింటికి వెళ్లి.. ఆహ్వానాలు అందించి..
- సందడిగా విందు, వినోదం..
- శుభ లేఖలు పంచి.. దగ్గరుండి మూడవ పెళ్లి జరిపించిన మొదటి భార్య - రెండో భార్య

(వెంకట్)

అల్లూరి జిల్లా ఏజెన్సీ లోని పెదబయలు మండలం గుల్లెలు పంచాయితీ కించూరు గ్రామం. అక్కడ సాగేని పండన్న.. పార్వతమ్మ ను తొలుత వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు అప్పలమ్మను కూడా మొదటి భార్య అంగీకారంతో పెళ్లాడాడు.. అలా ఇద్దరు భార్యలతో పండన్న సంసార జీవితం సాఫీగానే సాగిపోతుంది. ఏనాడు ఎటువంటి కుటుంబ కలహాలు లేకుండా ఆ ఇద్దరు భార్యలు భర్తను చక్కగా చూసుకుంటున్నారు.

అయితే.. అప్పటికే ఇద్దరు భార్యలు ఉన్న పండన్న.. లక్ష్మీ అనే మరో యువతిపై మనసు పారేసుకున్నాడు. ఆమెది జి మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ బందవీధి గ్రామం. లక్ష్మీని ఇష్టపడ్డ విషయం.. తనను ఎంతగా ప్రేమించే ఇద్దరు భార్యలకు చెప్పాడు. దీంతో తన భర్త ఆనందంలో తమ ఆనందం చూసుకునే ఆ ఇద్దరు భార్యలు పండన్నను ప్రోత్సహించారు.

దీంతో, ఇక పండన్న వెనక్కి తగ్గలేదు. ఎలాగైనా ఆమెను వివాహం చేసుకొని తమ జీవితం లోకి ఆహ్వానిం చాలని అనుకున్నాడు. అంతే.. ఆ ఇద్దరు భార్యలతో రాయభారం పంపాడు. పెద్దలు కూడా అంగీకరించడంతో.. లక్ష్మీని పండన్నకు ఇచ్చి వివాహం చేసేందుకు సిద్ధమ య్యారు. ఇక.. ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు.

పండన్నకు తల్లిదండ్రులు లేరు.. దీంతో, ఇద్దరు భార్యలే అతనికి సర్వస్వం. వాళ్లు కూడా అదే స్థాయిలో పండన్నను ప్రాణానికి మించి చూసుకుంటున్నారు. ఇక పెళ్లి పెద్దలు కూడా వాళ్ళిద్దరే అయ్యారు. శుభ లేఖల్లో కూడా.. ఆ ఇద్దరు భార్యలే అందరిని ఆహ్వానిస్తున్నట్టు ముద్రించారు. ఇంటింటికి వెళ్లి శుభ లేఖలను పంచారు. బంధు మిత్రులను ఆహ్వానించారు. 'మీ రాకను ప్రేమతో ఆహ్వానిస్తూ.. నిండు మనసుతో ఆశీర్వదించి మా ఆతిథ్యం స్వీకరించ ప్రార్థన.. అంటూ ఆ ఇద్దరు భార్యలు సాగేని పార్వతమ్మ, సాగేని అప్పలమ్మ..' అంటూ శుభ లేఖను



ముద్రించి ముగించారు.

జూన్ 25 ఉదయం 10 గంటలకు కించూరులో వివాహం జరిగింది. నవ వధువు లక్ష్మీ తరపు బంధువులు, మూడో పెళ్లి చేసుకుంటున్న పండన్న బంధు మిత్రులు, గ్రామ పెద్దలు కూడా వివాహానికి హాజరయ్యారు. అదే స్థాయిలో విందు కూడా ఏర్పాటు చేశారు.

అందరూ కలిసి గ్రాండ్‌గా పండన్న లక్ష్మీల వివాహాన్ని జరిపించారు. సంసారం సుఖ సంతోషాలతో సాగి పోవా లని ఆశీర్వదించారు.

# ఉచిత బస్సు ప్రయాణంపై త్వరలో తీపి కబురు

- విశాఖ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- ఏపీ రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

మంగళగిరి,మహానాడు:
మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీపై త్వరలోనే తీపి కబురు చెబుతామని ఏపీ రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని విశాఖ నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని తప్పకుండా నెరవేర్చుతామని వివరించారు. ప్రస్తుతం ఈ పథకం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అమల్లో ఉందని, ఆ రెండు రాష్ట్రాల్లో పథకం అమలు తీరును నిశి తంగా పరిశీలించి, ఏపీలో విధివిధానాలు ప్రకటిస్తామని రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీని గత ప్రభుత్వంలో పూర్తిగా విలీనం చేయలేదని, ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో ఆర్టీసీని ప్రక్షాళన చేస్తామని చెప్పారు.


జగన్ పాలనలో మంత్రులు గంగిరెద్దుల్లా తలలు ఊపడం



తప్పించి ఏంచేయలేదని, కానీ కూటమి మంత్రులకు సీఎం చంద్రబాబు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని వెల్లడించారు

# ఉద్యోగుల పక్షపాతి డి.శ్రీనివాస్

- ఉద్యోగుల కోసం సీఎంలతోనే పోరాడిన నేత
- ఎమ్మెల్సీ అశోక్ నివాళి



మంగళగిరి,మహానాడు:

పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మృతిపై టీడీపీ ఎమ్మెల్సీ, ఏపీఎన్జీఓ సంఘ మాజీ నేత అశోక్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనతో తనకున్న అను బంధాన్ని గుర్తు చేసుకున్నారు.

డి.శ్రీనివాస్ ఉద్యోగుల పక్షపాతి. 2010 అక్టోబర్‌లో నేను APNGO అసోసియేషన్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు 9వ పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) వ్యవహారంలో ఉద్యోగుల పక్షాన నిలబడి డి.శ్రీనివాస్ మద్దతు తెలపడం ఎన్నటికీ మరచిపోలేను.

నాటి రోశయ్య ప్రభుత్వం 38 శాతం ఫిట్ మెంట్ ప్రతి పాదించగా.. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా 39 శాతం ఇవ్వాలని డి.శ్రీనివాస్ ఉద్యోగుల తరపున గట్టిగా వాదించారు. నాడు డి. శ్రీనివాస్ రోశయ్యతో మాట్లాడుతూ.. నేనేగాని ముఖ్యమంత్రి పదవిలో ఉంటే ఒక్క శాతం కోసం ఉద్యోగులు ప్రభుత్వాన్ని ఈ విధంగా బ్రతిమాలుకునేలా చేసేవాడినే కాదని ఆయన రోశయ్యతో చెప్పారు.

దానికి రోశయ్య అయితే నువ్వే ఈ కుర్చీలో కూర్చొని, ఆ 29 శాతం ఫిట్ మెంట్ నువ్వే వారికి ఇవ్వు అని వ్యంగంగా మాట్లాడారు. అందుకు డి. శ్రీనివాస్ ఒక సీనియర్ నాయకుడైన మీరు వ్యంగ్యంగా మాట్లాడడంకంటే, సమస్యను పరిష్కరిస్తే బాగుంటుందని చెప్పారు. చాలా సుదీర్ఘ చర్చ తరువాత నాటి ముఖ్యమంత్రి రోశయ్య 39 శాతం ఫిట్ మెంట్ కు ఒప్పుకున్నారు.

9వ పీఆర్సీ ఫిట్‌మెంట్ విషయంలో డి.శ్రీనివాస్ ఉద్యో గుల పక్షాన నిలబడి వారి కోసం ముఖ్యమంత్రితోనే వాదనకు దిగటాన్ని ఎన్నటికీ మరచిపోలేను. ఏపీఎన్ జీవో, టీఎన్ జీవోలు సంఘాలు వినతి కోసం ఆయన నేరుగా ముఖ్యమంత్రి రోశయ్య ఇంటికే వచ్చారు. ఈ విషయం రెండు రాష్ట్రాల్లోని చాలామంది ఉద్యోగులకు తెలియదు. డి.శ్రీనివాస్ ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సాను భూతిని తెలియజేస్తున్నాను.

# మరీ ఇంత నిర్లక్ష్యమా?

- అంబేద్కర్ భవన్ ను శిథిలావస్థకు చేర్చారు
- కోట్లు వెచ్చించి పార్టీ కార్యాలయం కట్టుకున్నారు
- మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం
- ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- స్సీ వెల్ఫేర్ శాఖ డీడీకి మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలు

మచిలీపట్నం,మహానాడు:
ప్రజావసరాలను పక్కన పెట్టి.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి విలాసవంత భవనాన్ని కట్టుకున్నారని వైసీపీపై మచిలీపట్నం దళిత జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తరుణంలో... గత పాలకుల నిర్లక్ష్యంతో శిథిల భవనంగా మారిన మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్‌లోని అంబేద్కర్ భవన్ ను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం సందర్శించారు.

అక్కడి పరిస్థితులను పరిశీలించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మచిలీపట్నంలోని పలు దళిత సంఘాల ప్రతినిధు లతో కలిసి శిథిలావస్థకు చేరిన అంబేద్కర్ భవనాన్ని సంద ర్శించారు. గత పాలకులు వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దళితుల కోసం అంబేద్కర్ భవన నిర్మా ణాన్ని చేపట్టగా ఆ తర్వాత నిర్వహణ లోపానికి గురైందన్నారు.

2014లో అంబేద్కర్ భవన మరమ్మత్తులకు పూనుకోగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంబేద్కర్ భవనాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గత ఐదేళ్లుగా మూత



బడిందన్నారు. అంబేద్కర్ భవన్ పక్కనే కోట్ల రూపాయలతో వైసీపీ కార్యాలయ భవన నిర్మాణంపై పెట్టిన దృష్టిలో కొంతైనా అంబేద్కర్ భవనంపై చూపలేదని మాజీ మంత్రి పేర్ని నానిపై మంత్రి రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రస్తుత ప్రభుత్వం దళిత సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే అంబేద్కర్ భవన్ స్థానంలో ఆధునాతన సౌకర్యాలతో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలును నిర్మిస్తామని కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంపు గడ వల చౌదరి, మోటమర్రి బాబాప్రసాద్, దేవరపల్లి అనిత, మాదివాడ రాము, గుమ్మడి విద్యాసాగర్, మద్దాల కృష్ణ కుమార్, గురక బాలాజీ, చిత్తూరు యువరాజ్, చిన్న శేఖర్, పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 01, జులై 2024

### గూగుల్ మ్యాప్స్‌ను

# నమ్ముకొని నట్టేట మునిగారు!



**కేరళ, మహానాడు:** గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకొని ప్రయాణించిన యువకులకు చేదు అనుభవం ఎదురైంది. కేరళ కాసర్‌గోఢ్ జిల్లాకు చెందిన అబ్దుల్ రషీద్‌తో పాటు మరో యువకుడు ఆదివారం తె.జా కర్ణాటకలోని ఆసుపత్రికి బయలు దేరారు. ఈ సమయంలో గూగుల్ మ్యాప్స్‌ను ఉపయోగించారు. అయితే వారు ప్రయాణిస్తున్న కారు హఠాత్తుగా నదిలోకి దూసుకు పోయింది. నీటి ఉధృతికి కారు కొట్టుకుపోగా.. వారు చెట్టును పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరలయింది.


# పింఛన్ల పంపిణీలో ప్రతి నాయకుడు పాల్గొనాలి

◆ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,మహానాడు:** జూలై 1న జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి నాయకుడు సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొనాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మండల, టౌన్ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జులు, అన్ని పార్టీ పదువుల్లో ఉన్న నాయకులు జనసేన, బీజేపీ ఎన్‌డీఏ కూటమి నాయకులందరూ ఆయా సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని కోరారు. నాయకులందరూ వార్డులలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని చెప్పారు.

# కేంద్ర రుణభారం రూ.172 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ, మహానాడు:** కేంద్ర ప్రభుత్వ స్థూల రుణాలు గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసిక కాలంలో (2024 జనవరి-డిసెంబర్) 3.4 శాతం మేర పెరిగి రూ. 171.78 లక్షల కోట్లకు చేరాయి. అంతకు ముందు త్రైమాసికం చివరికి (2023 అక్టోబర్ -డిసెంబర్) ఇవి రూ.166.14 లక్షల కోట్లుగా ఉన్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ స్థూల రుణాల్లో పబ్లిక్ డెట్ (బాండ్లు రూపంలో) వాటా 90.2 శాతంగా ఉంది.

### రూ.12 వేల కోట్ల సమీకరణకు

# ఎన్టీపీసీకి గ్రీన్ సిగ్నల్




**న్యూఢిల్లీ, మహానాడు:** బాండ్లు, ఎన్‌సిడిల ద్వారా 12 వేల కోట్ల నిధులను సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపినట్లు ఎన్‌సిడి వెల్లడించింది.. ప్రైవేట్ ప్లేస్ మెంట్ కింద విడతల వారీగా బాండ్లను విక్రయించనున్నట్లు సెబీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ బాండ్ల టెన్యూర్, లిస్టింగ్ వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. FY24లో 1,81,166 కోట్ల ఆదాయం ఆర్జించిన ఎన్‌సిడి షేర్ ధర బిఎస్‌ఈలో ప్రస్తుతం 379.50గా ఉంది..



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జడ్పీ చైర్మన్ మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే రమేష్ రాథోడ్ పార్థివా దేహానికి నివాళలు అర్పించిన కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

### నాణ్యత లేకుండా నిర్మించడంతో కుంగిపోయిన సీసీ రోడ్..



హైదరాబాద్ - మణికొండ లక్ష్మీ నగర్ కాలనీలో నాణ్యత లేకుండా.. ఒక్కరోజు కూడా క్యూరింగ్ చేయక పోవడంతో కుంగిపోయిన సీసీ రోడ్..

# ఏపీకి ప్రత్యేక హెూదా/ప్యాకేజీ ఖాయమే!



భోగాది వెంకట్రాయుడు

(భోగాది వేంకట "ఏడ్చే దాని మొగుడు వస్తే, నా మొగుడూ వస్తాడు..." అనే సామెత చందంగా, చంద్రబాబు నాయుడు అడక్కుండానే ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హెూదా/ ప్రత్యేక ప్యాకేజి త్వరలోనే రావడానికి అవకాశాలు పుష్కలంగా కనపడుతున్నాయి.

2018 నుంచి దాదాపు ఓ ఏడాది పాటు, ఈ ప్రత్యేక హెూదా కోసం అప్పుడు ముఖ్యమంత్రి హెూదాలో ఉన్న చంద్రబాబు నాయుడు ఎంత యాగీ చేశారో తెలిసిందే. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న టీడీపీ మంత్రుల చేత రాజీనామా కూడా చేయించారు. ధర్మాగ్రహం అంటూ సభలూ - సమావేశాలు నిర్వహించారు. మోడీపై దుమ్మెత్తి పోశారు. చివరకు ఢిల్లీలోనూ నల్ల దుస్తులతో ధర్నాలు చేశారు.

ప్రధాని మోడీ చలించలేదు. ఉలక లేదు. పలక లేదు.

పైపెచ్చు, 2019 ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీని, రాష్ట్రాన్ని కూడా ఓడించడానికి ప్రధాని హెూదాలో చేయగలిగినంతా చేశారు. చేయగూడనివీ చేశారు. అయిదేళ్ల పాటు చంద్రబాబు మీద, తెలుగు ప్రజలమీద తన కక్షను నరేంద్ర మోడీ అలా తీర్చుకున్నారు.

2024 ఎన్నికల సమయం వచ్చేసరికి, మోడీకి జ్ఞానోదయం అయింది. దత్తపుత్రుల్ల ను పక్కనబెట్టి, చంద్రబాబు తో జతకట్టక తప్పని పరిస్థితి ఎదురైంది.

మూడోసారి అధికారంలోకి మోడీ వచ్చినప్పటికీ బీ ఛాతి మాత్రం... గతంలో మాదిరిగా 56 అంగుళాలు లేదు. బాగా కుంచించుకుపోయింది.

గతం లో అనేక అవమానాల పాల్జేసిన చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ ల మద్దతు లేకపోతే బీ కేంద్రం లో బీజేపీ(మోడీ) ప్రభుత్వానికి మనుగడ లేదు.

కీలెరిగి వాత పెట్టడంలో సిద్ధహస్తుడైన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మెల్లగా కత్తి బయటకు తీశారు. బీహార్ కు ప్రత్యేక హెూదా సంగతి ఏం చేశారు అంటూ కేంద్రాన్ని సున్నితంగా ప్రశ్నించారు. ఆ మేరకు, వారి పార్టీ కార్యవర్గ సమావేశంలో ఓ తీర్మానం ఆమోదించారు. ప్రత్యేక హెూదా లేకపోతే, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఏదో ఒకటి ఇవ్వక పోతే బీ నితీష్ కుమార్ జెండా ఎత్తేయ వచ్చు. అవతల, 'ఇండియా' కూటమి రెడీగా ఉంది. వాళ్లకు ఇంకో నలభై మంది మద్దతు ఉంటే చాలు, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి. అందువల్ల, బీహార్ నితీష్ కుమార్ డిమాండ్‌ను ఆమోదించడం గానీ, తిరస్కరించడం గానీమోడీకి అంత సులభం కాదు.

బీహార్ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటే బీ ఆంధ్ర ప్రదేశ్ విషయం లో కూడా అదే తరహా నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితిలో కేంద్రం పడిపోతుంది.

ఎందుకంటె, ఆంధ్రకు ప్రత్యేక హెూదా ఇస్తామని కేంద్రమే పార్లమెంట్‌లో ప్రకటించింది. బీహార్ కు ఇస్తామని కేంద్రం ఎప్పుడూ చెప్పలేదు. బీహార్ ముఖ్యమంత్రే అడుగుతున్నారు.

అటువంటిది, బీహార్ కు ఏది ఇస్తే, ఆంధ్రప్రదేశ్ కూ అదే తరహా ప్రయోజనాన్ని కేంద్రం కల్పించాల్సి ఉంటుంది. లేకపోతే 'ఇండియా' కూటమి కాచుకుని కూర్చునే ఉంది కదా!

అదీ గాక, బీహార్ అసెంబ్లీ కి ఎన్నికలు వచ్చే ఏడాది అక్టోబర్ / నవంబర్ లోపు జరగాల్సి ఉంది.

అందువల్ల బీహార్‌కు ప్రత్యేక హెూదానో, ఆర్థిక ప్రత్యేక ప్యాకేజీనో ఈలోగా సాధించాల్సిన అనివార్యత నితీష్ కుమార్‌పై ఉంది. లేకపోతే, ఎన్నికల తరువాత, ముఖ్య మంత్రిగా కొనసాగే అవకాశం ఆయనకు ఉండకపోవచ్చు.

అందువల్ల, తమకు ప్రత్యేక హెూదానో, ప్రత్యేక ప్యాకేజి నో ఇవ్వాలంటూ ఆయన కేంద్రంపై ఒత్తిడి తేవడం ఖాయం. బీహార్‌కి కేంద్రం ఏది ఇస్తే, అటువంటి వెసులు బాటునే అదే చేత్తో ఆంధ్ర కు కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

అందువల్ల, చంద్రబాబు నాయుడు నోరు తెరిచి అడగనవసరం లేదు. దానిబదులు బీ రాష్ట్రం లోని వివిధ పథకాలు, ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధులు రాబట్టగలిగితే చాలు.

ఇక, ప్రత్యేక హెూదా వచ్చినా, ప్యాకేజి వచ్చినా.... ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తారు అనడంలో సందేహం లేదు.

### రెండు లక్షల ఉద్యోగాల భర్తీ అంశంపై

# రాహుల్ గాంధీ స్పందించాలి



◆ ఎన్నికల ముందు తెలంగాణ యువతను కలిసి ఇచ్చిన హామీపైన రాహుల్ స్పందించాలి

◆ తెలంగాణ ప్రభుత్వంలో ఎవరు కూడా ఈ అంశం పైన స్పందించకపోవడంతో రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేటీఆర్

**హైదరాబాద్,మహానాడు:** తెలంగాణలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీపైన ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ వైఖరిని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఎన్నికల ముందు స్వయంగా తెలంగాణలోని యువతను నిరుద్యోగులను కలిసి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

ఈ మేరకు అన్ని ప్రధాన పత్రికల్లో పెద్ద ఎత్తున జాబ్ క్యాలెండర్ పేరుతో ప్రకటనలను సైతం విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ప్రకటనల్లో తేదీలతో సహా ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పటికే 7 నెలల సమయం గడిచిపోయిందని కానీ ఒక్క కొత్త ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ జారీ కాలేదని, అన్నిటికన్నా ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 10 నోటిఫికేషన్ తేదీల గడువు ముగిసిపోయిందన్నారు. ఇప్పటికే 7 నెలల కాలం గడిచిపోయిందని మరి మిగిలిన ఐదు నెలల కాలంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఏ విధంగా జారీ చేస్తారని కేటీఆర్ ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికైన నాయకులు కానీ తెలంగాణ ప్రభుత్వం కానీ ఈ ఉద్యోగాల భర్తీ విషయంలో బాధ్యత తీసుకొని స్పందించకపోవడం వల్లనే రాహుల్ గాంధీని ఈ విషయంలో ప్రశ్నిస్తున్నట్లు తెలిపిన కేటీఆర్, ఈ అంశం పైన రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్ర వ్యాప్తంగా మానవత్వాన్ని చాటుతున్న మానవత

◆ ఎన్. రామచంద్రా రెడ్డి, మానవత వ్యవస్థాపకులు

**గుంటూరు,మహానాడు:** ఆంధ్రప్రదేశ్‌లో 110 శాఖలతో 70 వేల మంది మానవత్వం గల సభ్యులతో గత రెండు దశాబ్దాలుగా కోట్లాది మంది ప్రజలకు మానవత్వాన్ని పంచుతున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషిని మానవత వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రా రెడ్డి వివరించారు. ఈనెల 30వ తేదీ ఆదివారం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో గల బాలాజీ కళ్యాణ మండపంలో మానవత వార్షిక సర్వసభ్య సమావేశానికి ఎన్. రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభకు మానవత అధ్యక్షురాలు పి. విమల కుమారి అధ్యక్షత వహించారు. ఎన్.రామచంద్రా రెడ్డి ప్రసంగిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా సమాజ సేవలో భాగస్వాములు అవుతూ ఉంటే వారి ఆయు ప్రమాణాలు పెరుగుతాయన్నారు. మానవ సేవే మాధవ సేవగా ప్రతి ఒక్కరూ భావించి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. గుంటూరు మానవత సంస్థ రెండు సంవత్సరాలలోనే వెయ్యి మంది సభ్యులతో బహుముఖ కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ ప్రపంచ అసమానతల ల్యాబ్ ఇటీవల అందించిన గణాంకాల ప్రకారం భారత జనాభాలో పైనున్న 10 శాతం చేతుల్లో




50 శాతం సంపద ఉందని, అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజల చేతుల్లో 10 శాతం సంపద మాత్రమే ఉందని, ఇలాంటి పరిస్థితులలో మానవత లాంటి సంస్థలు వేలాదిగా ఏర్పడి అట్టడుగున ఉన్న పేద ప్రజలకు అండగా నిలవాలన్నారు. మానవత చొరవ తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థల సమ్మేళనాన్ని గుంటూరులో నిర్వహించి వారి అనుభవాలను పంచుకోవాలన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ మానవత గుంటూరులో గత రెండు సంవత్సరాల కాలంలో వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలకు అన్నదానాలు, వైద్య శిబిరాలు, అవయవదాన ప్రోత్సాహం, రక్తదాన శిబిరాలు, ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రోత్సహకాలు లాంటి బహుముఖ కార్యక్రమాలు నిర్వహించి, గుంటూరు నగర ప్రజల అభిమానాన్ని పొందగలిగామన్నారు. ఈ సందర్భంగా లక్ష రూపాయల నిధితో విద్యానిధి కార్య క్రమాన్ని ప్రారంభించారు. దాతల సహకారంతో విద్యా నిధిని అభివృద్ధి చేసి, ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందిస్తామని పావులూరి రమేష్ ప్రకటిం చారు. మానవత సర్వసభ్య సమావేశ ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా అధ్యక్షులుగా కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.సతీష్‌బాబు, కోశాధికారిగా టి.వి. సాయి రాంలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ కె.జి.శంకర్, మానవత నేతలు ఏ.రామానుజులు రెడ్డి, వర్రె సుబ్రహ్మణ్యం, ఉప్పల సాంబ శివరావు, బి.ఎన్.మిత్ర, టి. ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మానవత్వాన్ని చాటి చెప్పే విధంగా రంగం రాజేష్ బృందం ఆలపించిన గేయాలు సభికులను ఆలోచింపచేసాయి.

08

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 01, జులై 2024



### అదానీకి విద్యుత్ బిల్లుల

# వసూలు అప్పగించే కుట్ర

- విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేసే దిశగా కాంగ్రెస్
- బిల్లుల వసూలు పైలెట్ ప్రాజెక్టుగా ఉన్న పాతబస్తీకే పరిమితం కాదు
- విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేసే కుట్ర
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై విద్యుత్ శాఖ మంత్రి మాట్లాడలేదు.
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి .జగదీశ్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:**

విద్యుత్ బిల్లుల వసూలును ప్రయివేటు కంపెనీలకు అప్పగించే విధంగా రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయాలు తీసుకోబోతుంది. విద్యుత్ బిల్లుల వసూలును ఆదానీకి అప్పగించేందుకు కుట్ర చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతికి విద్యుత్ బిల్లులు వసూలు పైలెట్ ప్రాజెక్టుగా ఉన్న పాతబస్తీకే పరిమితం కాదు. రాష్ట్రం మొత్తం విద్యుత్ బిల్లుల వసూలు ప్రయివేటు చేతిలోకి వెళ్తుంది. విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. విద్యుత్ సబ్సిడీలు, రైతులకు ఉచిత కరెంటు ఇక రాష్ట్రంలో వుండదు. రైతుల విద్యుత్ మోటార్లకు మీటర్లు పెడతారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చినా విద్యుత్ రంగాన్ని ప్రయివేటు వ్యక్తులకు అప్పచెప్పడాన్ని కేసీఆర్ అంగీకరించలేదు.

కేంద్ర ప్రభుత్వం,మోడీ కనుసన్నల్లో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. మోడీ,అదానీ విధానాలను తెలంగాణలో రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారు. విద్యుత్ సంస్థ ప్రజల ఆస్తి. దీన్ని ప్రయివేటు వ్యక్తులకు అప్పచెప్తున్నారు. ఓల్డ్ సిటీలో 45 శాతం మాత్రమే కరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయి. అందుకే ప్రయివేటు వ్యక్తులకు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అంటున్నారు.

తెలంగాణలో 95 నుండి 97 శాతం వరకు కరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయి. ఓల్డ్ సిటీ ప్రజలను అవమానించే విధంగా రేవంత్ రెడ్డి చర్యలు ఉన్నాయి సింగరేణి బొగ్గు గనులను వేలం వేస్తుంటే, డిప్యూటీ సీఎం భట్టి వేలంలో పాల్గొన్నారు. శ్రావణ పల్లి బొగ్గు గనిని వేలం నుండి ఎందుకు తీసివేయించలేదు? బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదు.

సింగరేణి బొగ్గు గనులను లీజుకు తీసుకున్న కంపెనీలను మేము అనుమతించమని బిఆర్ఎస్ ఇప్పటికే అభిప్రాయం చెప్పింది. విద్యుత్ బిల్లుల వసూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తెలిపాలి. రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనంగా వ్యవహరిస్తోంది. విద్యుత్ ఉద్యోగుల పాత్ర నామమాత్రంగా మారే అవకాశం వుంది. ప్రయివేటు వాళ్లకు అప్పగిస్తే విద్యుత్ వ్యవస్థ నాశనం అవుతుంది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. ఓల్డ్ సిటీలో 200 యూనిట్లలోపు కరెంటు బిల్లు వచ్చే కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఇప్పటి వరకు విద్యుత్ శాఖ మంత్రి మాట్లాడలేదు.






# మన డాక్టరమ్మ సేవకు జనం నీరాజనం

### డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఉచిత మెగా క్యాంపుకు అనుహ్య స్పందన

**దర్శి, మహానాడు:**

తెలుగుదేశం జనసేన బిజెపి కూటమినేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నేడు ఆదివారం చేపట్టిన ఉచిత మెగా క్యాంపుకు జనం పోటెత్తారు. దర్శి నియోజకవర్గంలోని ఊర్ల నుండి వైద్య సేవల కోసం పెద్ద ఎత్తున హైస్కూల్ ఆవరణకు తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన మెడికల్ క్యాంపు సాయంత్రం 4.30 గంటల వరకు కిక్కిరిసి జనంతో కౌంటర్లన్నీ నిండిపోయాయి.

విశ్రాంతి లేకుండా డాక్టర్ బృందం ప్రజానీకానికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు మెడికల్ కిట్లను అందజేశారు వచ్చిన రోగులకు ఎలాంటి అసౌకర్యాలు



కలపకుండా ఫుడ్ ప్యాకెట్లు ఫ్రూట్స్ మంచినీరు నిర్విరామంగా అందజేసి ఏర్పాటులో ఎలాంటి లోపాలు లేకుండా మన పార్టీ శ్రేణులు, అధికారులు, వైద్య సిబ్బంది పనిచేశారు అక్కడ వైద్య శిబిరంలో దాదాపు 5260 ఓపీలు నమోదు అయ్యాయి అంతేకాక వారి బంధుమిత్రులతో పార్టీ శ్రేణులతో ఈ మంచి కార్యక్రమానికి అనుహ్యస్పందన లభించింది.

జనం ఉదయం నుంచి జననేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వైద్యవృత్తి పరంగా చేపట్టిన ప్రజాసేవలో తొలి ఘట్టం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆమె సేవ కార్యక్రమానికి ఆశీర్వాదాలు అందించారు. మరోసారి గొట్టిపాటి ఆడబిడ్డగా ప్రజా సేవకురాలుగా ప్రజలకు అవసరమైన వైద్య సేవ అందించి దర్శి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని పలువురు వృద్ధులు పెద్దలు మాట్లాడుకోవడం కనిపించింది. రాజకీయాల కోసం కాకుండా ప్రజల కోసం ప్రజల అవసరాల కోసం ప్రజారాజ్యం కోసం ఈ మంచి మెడికల్ క్యాంపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ప్రజానేత నారా చంద్రబాబునాయుడు గారు ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గారు స్ఫూర్తితో డాక్టర్ లక్ష్మీ గారు చేపట్టిన ఉచిత మెగా మెడికల్ క్యాంపు అనూహ్య స్పందన లభించింది.

ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ...

.... ఇది ప్రారంభం మాత్రమేనని ఈ తొలి అడుగు మాత్రమేనని.. ప్రజల ఆర్యోగం కోసమే ఉచిత మెగా వైద్య శిబిరం అని



ప్రతినిత్యం నేను ప్రజలతో ఉండి ప్రజాసేవ కోసం నిరంతరం పాటు పడతానని వైద్యపరంగా నాకు తెలిసిన వైద్యం మాతోటి వైద్యుల సహకారంతో ప్రజలకు అవసరమైన ఈ మెడికల్ క్యాంపును చేపట్టానని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి గారితో పాటు డాక్టర్ కడియాల లలిత సాగర్ డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు తదితర డాక్టర్ల బృందం వైద్య సేవలు అందించిన వారిలో ఉన్నారు.



# కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

### లాభ దాయక పంటల సాగుపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి

### కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు, 30 జూన్, మహానాడు:**

జిల్లాలో రైతులకు పంటల సాగులో ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించటంతో పాటు, పంట రుణాలు, సక్రమంగా సాగునీరు, లాభదాయకమైన సాగు యాజమాన్య పద్దతులపై అవగాహన కల్పించేలా వ్యవసాయశాఖ మరియు అనుబంధశాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు.

ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, శాసనసభ్యులు నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి తో కలసి జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయశాఖ అనుబంధశాఖల వివరాలు, సాగు భూముల వివరాలు, మండలాలు వారీగా సాగు చేస్తున్న పంటల వివరాలు, ఇరిగేషన్ కాల్వలు, వర్షపాతం వివరాలు, విత్తనాల సరఫరా, ఎరువులు లభ్యత, వినియోగం, కౌలు రైతు కార్డులు, భూసారా పరీక్షలు, ఉద్యాన పంటలు, ప్రకృతి వ్యవసాయం, రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు తదితర అంశాలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఇతర అనుబంధశాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ కు వివరించారు. ఈ సంధర్భంగా జిల్లాలో ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా దీర్ఘకాలికంగా సాగు చేస్తున్న పంటలకు ప్రత్యామ్నాయంగా ఇన్నోవేషన్ పంటలు సాగు చేసేందుకు ఉన్న అవకాశాలపై ప్రతిపాదనలను సిద్ధం చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. లాభ దాయక పంటల సాగుపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం సబ్సీడీపై అందించే విత్తనాలను రైతులందరికీ అందేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో పేద రైతులు పంటదిగుబడులు నష్టపోవటానికి కారణం అవుతున్న నకిలీ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అరికట్టేందుకు విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తయారీ, విక్రయాలు చేసే వారిపై దాడులు నిర్వహించటం జరుగతుందని, అటువంటి వారు వాటిని వెంటనే నిలిపివేయాలని ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా కల్తీ, నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తయారీ, విక్రయ కేంద్రాలను, కృత్రిమంగా కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయాలు చేసే వారిపై రానున్న నెల రోజుల్లో పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసి స్పష్టమైన ఫలితాలు కన్పించేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ట్రాన్స్పోర్ట్ ద్వారా వచ్చే నకిలీ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలపైన నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. జిల్లాలో నిబంధనలు పాటించకుండా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై పిర్యాదులను ఇచ్చేందుకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయాలని, దీనిని ప్రతి వ్యాపార సంస్థ వద్ద ప్రదర్శించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబరుకు వచ్చిన ప్రతి ఫిర్యాదును పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, వివరాలను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పరిశీలించేలా రిజిస్టర్ చేయాలన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు తయారీ, విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా దీర్ఘకాలికంగా శాశ్వత పరిష్కారం కోసం చట్టంలో అవసరమైన మార్పుల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో కౌలు రైతులందరికీ పంట రుణాలు అందించేలా వ్యవసాయశాఖ, రెవెన్యూ, బ్యాంకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, దీనిపై ఉన్న నిబంధనలను సరళతరం చేసి నిజమైన కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్ళి చర్చించటం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకోసం ప్రవేశ పెట్టిన పథకాలను మంచిగా అమలు చేస్తున్న రాష్ట్రలకు సంబంధించిన వివరాలను సేకరించి, అవే విధానాలను జిల్లాలోను అనుసరించేందుకు అవసరమైన నివేదిక అందిం చాలన్నారు. భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువులు శాంపిల్స్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇరిగేషన్ కు సంబంధించి ప్రధాన, మేజరు, మైనర్ కాల్వలతో పాటు, పంట కాల్వలు పూర్తి స్థాయిలో గుర్రపు డెక్క తొలగించి, సాగు నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీడీసీసీ బ్యాంకులో జరిగిన అవకతవకలపై విచారణను వేగ వంతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్ వివిధ అంశాలపై సూచనలు అందిస్తూ జిల్లాలో భారీ స్థాయిలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలు చేసే కంపెనీలపై తొలుత తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తే ఇతర విక్రయదారుల్లోను మార్పు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. భూయజమానులు కాకుండా, వాస్తవంగా భూమి కౌలు రైతులకే పంట రుణాలు అందించే చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ యంత్ర పరికరాలు అందించే పథకాలను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీడీసీసీ బ్యాంకులో రైతుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు, ఇతర ఆర్ధిక అవకతవకలపై అసలు సూత్రదారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కే. ఈశ్వర రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి గాలి దేముడు, జిల్లా ఏపీఎంఐ పీడీ వజ్రశ్రీ, జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వర రావు, లాం ఏడీఆర్ దుర్గాప్రసాద్, కెవీవీ సత్యనారాయణ పశు సంవర్ధక శాఖ, మార్క్ఫెడ్ సీపీఓ శేషశ్రీ, ఏపీసీఎన్ఎఫ్ పీడీ రాజకుమారి, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, మార్కెటింగ్ ఏడీ రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర యోధుడు రామోజీరావు సంస్మరణ సభ

**గుంటూరు,మహానాడు:**

అక్షర యోధుడు పద్మ విభూషణ్ రామోజీరావు సంస్మరణ సభ ఈనెల 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, రామోజీరావు సంస్మరణ సభ ఆహ్వాన సంఘం చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రకటించారు. ఈనెల 30వ తేదీ ఆదివారం సాయంత్రం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో రామోజీ సంస్మరణ ఆహ్వాన సంఘ సమావేశం జరిగింది. రామోజీరావు సంస్మరణ సభలో నరసరావుపేట లోక్ సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు మండలి బుద్ధ ప్రసాద్, శాసనమండలి సభ్యులు కె.యస్ లక్ష్మణరావు గుంటూరు నగర శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్ళ మాధవి, ఏపీ కాంగ్రెస్ కమిటీ మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసి రెడ్డి, సిపిఐ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, డాక్టర్ పివి రమేష్ ఐఏఎస్ రిటైర్డ్, డాక్టర్ పి. కృష్ణయ్య ఐఏఎస్ రిటైర్డ్, మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్చార్జి పాతూరి నాగభూషణం తదితరులు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. రామోజీరావు స్వయం శక్తితో అభివృద్ధి చెందారని నిజాయితీతో, నిబద్ధతతో, నిరంతరం శ్రమించి, సంపదను సృష్టించి 25 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 25 వేల మందికి పరోక్షంగాను ఉపాధి కల్పించారని అన్నారు.

అన్నదాత పత్రిక వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు తోడ్పడుతుందని ,మయూరి, ప్రతిఘటన లాంటి చిత్రాలు ప్రజలను ఆలోచింప చేశాయన్నారు . రామోజీ ఫిల్మ్ సిటీ ప్రపంచంలోనే అద్భుతమైన ఫిల్మ్ సిటీగా రూపొందిందని, ప్రియా పచ్చళ్ళు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వాళ్ళకు తెలుగు రుచులు అందిస్తున్నాయని, మార్గదర్శి ద్వారా సామాన్య ప్రజలలో పొదుపును ప్రోత్సహిస్తుందని ,ఈటీవీలో ప్రసారమవుతున్న మార్గ దర్శి ప్రపంచంలోని మహనీయులను పరిచయం చేస్తుందని, యువ కార్యక్రమం ద్వారా యువకులలో నైపుణ్యాలను వృద్ధి చేస్తుందని అన్నారు. అక్షరాస్యత ఉద్యమంలో సారా, మద్య వ్యతిరేక ఉద్యమాలలో రామోజీ కీలక పాత్ర పోషించారన్నారు. సమాచార హక్కు చట్టాన్ని తెలుగు ప్రజలకు సుపరిచయం చేశారని తెలిపారు. నేటి వరకు దాదాపు 120 కోట్ల రూపాయలు వివిధ సందర్భాలలో విరాళాలు అందించి ప్రజలను ఆదుకున్నారని పేర్కొన్నారు.

రాజ్య హింసను, అకృత్యాలను, అవినీతులపై నిరంతరం పోరాడిన యోధుడు రామోజీ అని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా వైకాపా ప్రభుత్వం చేస్తున్న దుష్ట చర్యలను, దుర్మార్గాలను చీల్చి చెండాడుతూ ప్రజా విజయం సాధించేంత




వరకు పోరాడిన యోధులు రామోజీరావు అని అన్నారు. ఆహ్వానం సంఘం చైర్మన్ గా జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి ఉపాధ్యక్షులుగా భాష్యం విద్యాసంస్థల వ్యవస్థాపకులు భాష్యం రామకృష్ణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి రామచంద్రరాజు, కార్యదర్శిగా మానవత చైర్మన్ పావులూరి రమేష్, సభ్యులుగా సామినేని కోటేశ్వరరావు, కన్నా మాస్టర్, మేకల రవీంద్రబాబు, డాక్టర్ వి .సింగారావు, కొరివి వినయ్ కుమార్, గోరంట్ల పున్నయ్య చౌదరి, కొండ శివరామిరెడ్డి ,పి శేషుబాబు తదితరులు ఆహ్వాన సంఘంలో సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పి. రామచంద్రరాజు ప్రసంగిస్తూ రామోజీ సంస్మరణ సభను జయప్రదంగా నిర్వహించడానికి గుంటూరు నగరంలోని ప్రముఖులు, మేధావులు, జర్నలిస్టులు విరివిగా పాల్గొనాలని కోరారు. ప్రముఖ పారిశ్రామివేత్త సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నిరంతరం ఎత్తిచూపుతూ పరిష్కారం కోసం రామోజీరావు కృషి చేసే వారిని గుర్తు చేశారు. కన్నా విద్యాసంస్థల వ్యవస్థాపకులు కన్నా మాస్టర్ ప్రసంగిస్తూ గుంటూరు నగరంలోని అన్ని విద్యాసంస్థల నుండి ఉపాధ్యాయులు సంస్మరణ సభకు హాజరవుతారని తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల సంఘ నేత మేకల రవీంద్రబాబు ప్రసంగిస్తూ రామోజీరావు నేటి సమాజంలో ఒక రోల్ మోడల్ గా ఉన్నారన్నారు. తెలుగు భాష ఉద్యమ నేత డాక్టర్ వి. సింగారావు ప్రసంగిస్తూ గుంటూరు నగరంలోని తెలుగు భాష ఉద్యమంలో భాగస్వాములైన వారందరిని రామోజీ సంస్మరణ సభకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. తెలుగు భాష అభివృద్ధికి రామోజీ చేసిన సేవలను కొనియాడారు.

9
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 01, జులై 2024

# రేషన్ బియ్యం స్కామ్‌లో అడ్డంగా బుక్కైన ద్వారంపూడి

- అక్రమ రవాణా అంతా.. ద్వారంపూడి ఫ్యామిలీ కనుసన్నల్లో
- మంత్రి నాదెండ్ల కాకినాడలో మకాం
- ద్వారంపూడి అరాచకాలు చూసి ఆశ్చర్యపోయా
- మంత్రి నాదెండ్ల మనోహర్

**కాకినాడ,మహానాడు:**
రేషన్ బియ్యం స్కామ్‌ను ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ స్కామ్‌లో కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి ఉచ్చు బిగుస్తోంది. రెండు రోజులుగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో మకాం వేశారు.

కాకినాడ సిటీలో, పోర్టులో స్వయంగా మంత్రి నాదెండ్ల తనిఖీలు చేశారు. కాకినాడ పోర్టులో అశోక్ ఇంటర్నేషనల్, హెచ్ వన్ గోడౌన్లలో భారీగా రేషన్ బియ్యం గుర్తించారు.ఆ బియ్యాన్ని ఆఫ్రికాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం అందుకుని అధికారులు, రెండు గోడౌన్లను సీజ్ చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అంతా.. ద్వారంపూడి ఫ్యామిలీ కనుసన్నల్లో జరిగిందటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాకినాడ పోర్టును ద్వారంపూడి.. తన అక్రమాలకు అడ్డాగా మార్చుకున్నాడని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు.



ద్వారంపూడి అరాచకాలు చూసి తానే ఆశ్చర్యపోయానని చెప్పుకొచ్చారు.తనిఖీలు పూర్తి అయ్యేంత వరకు పోర్టు నుంచి బియ్యం రవాణా నిలిపివేశారు.

రాష్ట్రంలో పేదల పొట్ట కొట్టి అదే రేషన్ బియ్యాన్ని ఆఫ్రికన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారంటూ మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖ సంబంధించి శాఖపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. పూర్తిస్థాయి పరిశీలన జరిపాక, సీఐడీతో విచారణ కూడా జరిపిస్తామని మంత్రి నాదెండ్ల అన్నారు.




## నిరుద్యోగుల తరుపున నిలదీస్తాం
# అసెంబ్లీని స్తంభింప చేస్తాం

- ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి మోతిలాల్ నాయక్ తో మాట్లాడాలి
- ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులతో చర్చ జరపాలి. ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే దాకా నిరుద్యోగులు తరఫున బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది
- నిరుద్యోగ యువతీ యువకులకు బిఆర్ఎస్ పూర్తి అండగా ఉంటుంది
- మోతీలాల్‌కు ఏం జరగక ముందే ప్రభుత్వం తక్షణ స్పందించాలి. అతని ఆరోగ్యం పట్ల ప్రభుత్వాన్ని పూర్తి బాధ్యత.
- కోదండరాం పిల్లల హక్కుల పట్ల పూర్తి బాధ్యత తీసుకోవాలి. అమలు చేసే విధంగా ముందుకు రావాలి.
- గ్రూప్స్, నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ నాయక్ ను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,మహానాడు:**
మోతీలాల్ నాయక్ ఏడు రోజుల నుండి ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేకపోవడం దురదృష్టకరం.మోతిలాల్ దీక్ష విరమించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన అందరం కలిసి కోరాం. ఇది నా ఒక్కడి పోరాటం కాదు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్న అన్నడు. ప్రభుత్వం దిగివచ్చేదాకా దీక్ష విరమించను అని చెప్పిండు.
పదేపదే కన్విన్స్ చేసే ప్రయత్నం చేసాం, అందరం కలిసి పోరాటం చేద్దాం, మేము మీ వెంట ఉన్నాం, ప్రాణం ముఖ్యం, తండ్రి లేని వాడివి అని కన్విన్స్ చేసే ప్రయత్నం చేశాం.

కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ చూపెట్టి నిరుద్యోగులను వాడుకొని వదిలిపెట్టారు. ఎన్నికలు అయిపోయాక నిరుద్యోగుల గుండెల మీద తన్నుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. ఓడదాటే దాకా ఓడ మలన్న ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్న అన్నట్లు ఉంది.
ఆనాడు నిరుద్యోగుల కోసం ప్రొఫెసర్ కోదండరాం గారు, రియాజ్ గారు, బాల్మూరి వెంకట్, మురళి గారు, రేవంత్ రెడ్డి గారు అశోక్ నగర్ లో కోచింగ్ సెంటర్లు చుట్ట తిరిగారు. బస్సు యాత్రలు చేశారు.
రాహుల్ గాంధీని అశోక్ నగర్కు తీసుకువచ్చి ప్రామిస్లు చేయించారు.మీకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయి, నిరుద్యోగులకు రాలేదు.ఎందుకు మీ గొంతులు మూగబోయాయి?రాహుల్ గాంధీ గారు అశోక్ నగర్కు వచ్చి రెండు లక్షల ఉద్యోగాలు ఏడాదిలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.
ఏడు నెలలు పూర్తయింది ఎందుకు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వలేదు.రాహుల్ గాంధీ గారికి మా నిరుద్యోగుల బాధలు కనపడడం లేదా వినపడడం లేదా? నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే పోరాటాలు చేస్తుంటే ఎందుకు రాహుల్ గాంధీ గారు పట్టించుకోరు.
రేవంత్ రెడ్డికి చెప్పాలని ట్విట్టర్ వేదికగా రాహుల్ గాంధీ గారి ట్యాగ్ చేస్తూ నిరసన తెలియజేస్తే పట్టించుకోరు. అశోక్ నగర్ లో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు రాహుల్ గాంధీ గారు చొరవ చూపాలి రేవంత్ రెడ్డి కి డైరెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న.
నిరుద్యోగులను రెచ్చగొట్టే విధంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు, గ్రామాల్లోకి వెళ్లి ఓట్లు వేయాలని అడిగారు. చిటికెలో చేస్తా అన్నారు. 7 నెలలు గడిచినా చేయడం లేదు. బాండ్ పేపర్ల మీద రాసిచ్చిన హామీలు ఏమయ్యాయి? అసెంబ్లీలో భట్టి విక్రమార్క 1:100 ఎలిజిబిలిటీ గ్రూప్ వన్ మెయిన్స్కి ఇవ్వాలన్నారు.
ప్రొఫెసర్ కోదండరాం ఇదే నిరుద్యోగులను రెచ్చగొట్టారు.ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు. ఉమ్మడి ఏపీలో, కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో పెంచడం సాధ్యమైనప్పుడు ఇక్కడ ఎందుకు సాధ్యంకాదు రేవంత్ రెడ్డి కోదండరామిరెడ్డి సమాధానం చెప్పాలి.ప్రజా పాలనలో నిరుద్యోగులు దరఖాస్తులు ఇస్తూ చిన్నారెడ్డి గారి కాళ్ళ మీద పడితే ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు.
నిరుద్యోగులు యువకులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారు ఇదేనా ప్రజాపాలన.విద్యార్థులు న్యాయమైన డిమాండ్ అడుగుతున్నారు మీరు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

1. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా గ్రూప్ వన్ మెయిన్స్ ఎల్జిబిలిటీ 1:50 నుంచి 1:100 పెంచాలి. ఒక్కో పోస్టుకు మెయిన్స్ కి వంద మంది పోటీ పడే అవకాశం కల్పించాలి.
2. గ్రూప్-2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్-3కి మూడు వేల ఉద్యోగాలు కలుపుతామన్న మాట నిలబెట్టుకోవాలి. పరీక్షకు పరీక్షకు మధ్య 2నెలల గ్యాప్ ఉండేలా చూడాలి.
3. ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన హామిని నిలబెట్టుకోవాలి. ఆరునెలలు గడించింది, మరో ఆరు నెలల సమయమే ఉందన్న విషయం గుర్తించి ఆ దిశగా చర్యలు ప్రారంభించాలి.
4. ఎప్పటికప్పుడు ఖాళీ పోస్టులను గుర్తించి, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న హామిని నిలబెట్టుకోవాలి.
5. అధికారం లోకి వచ్చాక మొదటి క్యాబినెట్ లోనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామన్న హామి నిలబెట్టుకోవాలి. 11వేల పోస్టులు కాదు, 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలి.
6. గురుకుల టీచర్ పోస్టులు బ్యాక్ లాగ్ కాకుండా, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పోస్టులు భర్తీ చేసి అభ్యర్థులకు, నిరుద్యోగులకు న్యాయం చేయాలి.
7, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జి.వో నెంబర్ 46 రద్దు చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. కానీ అధికారంలోకి వచ్చాక వారికి నట్టేట ముంచి జి.వో 46 ప్రకారమే నియామక ప్రక్రియ పూర్తి చేశారు. ప్రభుత్వం వెంటనే జి.వో 46 ద్వారా ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.
8, రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు నెలకు 4000 చొప్పున నిరుద్యోగపు తీస్తామని ప్రకటించారు. మీరు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు పడ్డ బకాయి మొత్తం సహా నిరుద్యోగ భృతిని నెల నెలా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. లేకుంటే నిరుద్యోగుల తరఫున మరో పోరాటానికి బిఆర్ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరిస్తున్నాం.



# కొత్త చట్టాలు ప్రాథమిక హక్కులకు విఘాతం

- స్టాండింగ్ కమిటీ సూచనలను కేంద్రం పట్టించుకోలేదు
- సీనియర్ న్యాయవాదులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్నారు
- కొత్త చట్టాల పేర్లు దక్షిణ భారత రాష్ట్రాల భాషకు వ్యతిరేకం
- బార్ కౌన్సిల్‌ను మోడీ మోసం చేశారు
- సుప్రీం కోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేస్తున్నా
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్,సోమ భరత్ కుమార్, గెల్లు శ్రీనివాస యాదవ్, లలిత రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:**
జులై 1 వ తేదీ నుండి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్,ఇండియన్ పీనల్ కోడ్,ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కొత్త చట్టాలను తీసుకువస్తుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఈ చట్టాలు ఉన్నాయి. మార్పు అంటే మంచి జరగడం. కానీ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలు ప్రాథమిక హక్కులకు విఘాతంగా వున్నాయి.

2023 ఆగస్టులో చట్టాల మార్పు బిల్లులను పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టింది. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కొత్త చట్టాలపై విస్తృతంగా పరిశీలించి అనేక మంచి సూచనలు చేశారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచనలను కేంద్రం పట్టించుకోలేదు

దాదాపు 160 మంది పార్లమెంట్ సభ్యులను బయటకు పంపి బిల్లును కేంద్రం పాస్ చేయించుకుంది. దేశ వ్యాప్తంగా వున్న సీనియర్ న్యాయవాదులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్నారు. కొత్త చట్టాలను రద్దు చేయాలని కేంద్ర హొంశాఖా మంత్రి, న్యాయ శాఖా మంత్రులకు లేఖ రాశాను. చట్టాలను ఇంగ్లీష్ లో ప్రవేశపెట్టాలని రాజ్యాంగంలో ఉంది.

కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలు ఇండియన్ పీనల్ కోడ్ కు భారతీయ న్యాయ సంహిత అని పేరు పెట్టారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కు భారతీయ నాగరిక సురక్ష

సంహిత అనే పేరు పెట్టారు. కొత్త చట్టాలకు హిందీ, సంస్కృతంలో పేర్లు పెట్టారు. కొత్త చట్టాల పేర్లు దక్షిణ భారత రాష్ట్రాల భాషకు వ్యతిరేకంగా ఉన్నాయి.

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లాయర్లు ఆందోళన చేయవద్దని అన్ని బార్ అసోసియేషన్స్ కు లేఖలు రాశారు. మోడీ తెచ్చిన నల్ల చట్టాలతో రైతులు చనిపోయారు. చట్టాల మార్పులను వాయిదా వేయాలని మోదీని డిమాండ్ చేస్తున్నాం.

ఎఫ్.ఐ.ఆర్‌ను రిజిస్టర్ చేయకుండా ప్రిలిమినరీ ఎంక్వైరీ చేసే విధంగా కొత్త చట్టం తెచ్చారు. స్టేషన్ బెయిల్ ను స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ దుర్వినియోగం చేస్తున్నారు. భాదితుడు హింసకు గురి అవుతున్నారు. దేశ న్యాయ వ్యవస్థను

కేంద్రం నిర్వీర్యం చేస్తుంది. కొత్త చట్టాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతంగా మారాయి.

చేతికి బేడీలు వేయవద్దని సుప్రీం కోర్టు చెప్పింది. ఇప్పుడు కొత్త చట్టాల్లో చేతికి బేడీలు వేయాలని వుంది. కొత్త చట్టాల వలన భాదితుడికి అన్యాయం జరుగుతోంది. పోలీస్ కస్టడీకి తీసుకోవడానికి 14 రోజులకు బదులుగా 90 రోజుల వరకు అవకాశం ఇచ్చారు. బార్ కౌన్సిల్‌ను మోడీ మోసం చేశారు

కొత్త చట్టాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేస్తున్నా కొత్తచట్టాలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించాలి. కొత్తచట్టాలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటుంది.

# దళిత, బీసీ వర్గాల ద్రోహి.. వీసీ రాజశేఖర్

- నలుగురు గెస్ట్ ఫ్యాకల్టీల పొట్ట కొట్టిన వీసి రాజశేఖర్
- వ్యక్తిగత కక్షకు వర్సిటీ నిధులు దుబారా చేసిన వీసి
- కుల రాజకీయాలతో వర్సిటీ వాతావరణాన్ని నాశనం చేసిన వీసి
- వీసి రాజశేఖర్ కబంధహస్తాల నుంచి నాగార్జున వర్సిటీని కాపాడాలి

**గుంటూరు, 30 జూన్, మహానాడు:**
ప్రపంచ మేధావి, దళితుల ఆశాజీవి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు వారసుడునని చెప్పుకుంటున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసి ఆచార్య రాజశేఖర్ ముగ్గురు దళితులు, ఒక బీసీ వర్గానికి చెందిన అధ్యాపకుల పొట్ట కొట్టారు.విసి రాజశేఖర్ తన వ్యక్తిగత కక్షను నలుగురు అతిధి అధ్యాపకులపై తీర్చుకోవడానికి విశ్వవిద్యాలయం నిధులను దుబారా చేశారు.

విశ్వవిద్యాలయానికి శాశ్వత వీసీ కాగానే రాజశేఖర్ అతిధి అధ్యాపకుల రెన్యువల్‌కు ఇంటర్వ్యూ లంటూ బూటకపు ఇంటర్వ్యూలు నిర్వహించి నలుగురు దళిత,బిసి వర్గాలకు చెందిన అతిధి అధ్యాపకులను ఉద్యోగాల నుంచి తొలగించి వారి పొట్ట కొట్టారు.

తొలగింపుపై నలుగురు అతిధి అధ్యాపకులు ఏపీ హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు సింగిల్ బెంచ్ న్యాయమూర్తి విశ్వవిద్యాలయం నిర్వహించిన ఇంటర్వ్యూల సెలక్షన్ కమిటీ మినిట్సును పరిశీలించి ఇంటర్వ్యూలు బూటకమని, ఏకపక్షంగా, కక్షపూరితంగా నిర్వహించారంటూ ఆ ఇంటర్వ్యూలను రద్దు చేయటంతో పాటు ఉద్యోగాల నుంచి తొలగించిన నలుగురు అతిధి ఆధ్యాపగలను రెండు వారాల్లోపు ఉద్యోగంలోకి తీసుకోవాలని తీర్పునిచ్చారు.

ప్రపంచ మేధావిని, దళితుల ఆశా బంధునని,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారసుడునని చెప్పుకుంటున్న ఆచార్య రాజశేఖర్ హైకోర్టు తీర్పును గౌరవించకుండా, ఆ నలుగురుపై తన వ్యక్తిగత కక్షను తీర్చుకోవడానికి న్యాయవాది కాసా జగన్మోహన్ రెడ్డికి ఆరు లక్షల రూపాయలు ప్రాసెసింగ్ ఫీజుగా చెల్లించి హైకోర్టులో సవాల్ చేసి దళిత,బిసి వర్గాల ద్రోహిగా రాజశేఖర్ నిలిచారు.

తన బౌన్సర్లకు రెన్యువల్‌తో పాటు ఉద్యోగాలు: ఏఎన్యూ తాత్కాలిక విసిగా రాజశేఖర్ నియమితులైనప్పటినుంచి తనకు బౌన్సర్లుగా ఉంటూ ఎప్పటికప్పుడు తనకు మద్దతుగా నిలిచిన వారితోపాటు వైసీపీ నాయకుల చేత సిఫార్సులు చేయించిన వారికి సోషియాలజి ,కామర్స్ అండ్ మేనేజ్మెంట్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ ఆర్ ఎం విభాగంలో, ఇంజనీరింగ్ కాలేజీలోని మెకానికల్ విభాగంతో పాటు ఆర్కిటెక్చర్ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలు ఇచ్చారు.

అలాగే విసి రాజశేఖర్ తన ఇద్దరు స్కాలర్లకు ఇంగ్లీషు విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలు ఇచ్చారు.

వర్సిటీ గ్రంథాలయంలో రోజువారి వేతన ఉద్యో గిగా పనిచేస్తున్న కొండలరావును ఎంఎల్ ఐసి విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగం ఇచ్చి నెలకు 30000 వేతనంగా చెల్లిస్తున్నారు. వాస్తవంగా ఇతను ఎకనామిక్స్ లో పిహెచ్.డి చేశారు.ఎల్. ఐ.సి కోర్సులో ఇతనికి పీహెచ్.డి లేకపోయినాను నిబంధనలకు విరుద్ధంగా నెలకు 30000 వేతనం చెల్లిస్తున్నారు.

తన అనుచరులుగా ఉన్న ఒక గెస్ట్ ఫ్యాకల్టీకి నెలకు 40000 వేతనంగా చెల్లించడంతో పాటు హాస్టల్ అడిషనల్ వార్డెన్‌గా నియమించడం జరిగింది. ఇదే పదవి తన ప్రముఖ అనుచరుడు



కి కూడా ఇచ్చారు.

విసి రాజశేఖర్ నిబంధనలకు విరుద్ధంగా తనకు బౌన్సర్లుగా వ్యవహరించిన గెస్ట్ ఫ్యాకల్టీలను పీజీ, బీఈడీ, ఇంజనీరింగ్ జవాబు పత్రాలు మూల్యాంకనం కేంద్రాలలో ఏసిటిఏలుగా నియమించి అదనపు ఆదాయం సమకూర్చారు.

తనకు మద్దతుగా నిలిచిన కోటేశ్వరరావు అనే అతనిని వర్సిటీ పూలే అధ్యయనం కేంద్రంలో ప్రోగ్రామర్ గా నియమించారు.

వైసీపీ నాయకుల సిఫార్సులతో పాటు లక్షలు వసూలు చేసి చాలామందిని కాజువల్ లేబర్ ఉద్యోగులుగా నియమించి పని లేకుండా వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రంధాలయంలో ఉంచడం జరిగింది..ఆ తర్వాత వారిని వేరు వేరు విభాగాలకు నియమిస్తూ రాజశేఖర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశాడు.

పాలకమండలి ఆమోదం లేకుండానే నిధులు వినియోగం: వీసి రాజశేఖర్ నాక్ సందర్శన పేరుతో పాలకమండలి ఆమోదం లేకుండానే వర్సిటీ డిపాజిట్లను నుంచి రోడ్లకు కోట్లాది రూపాలను దుర్వినియోగం చేశారు. విసి వర్సిటీ గ్రంధాలయం వద్ద సైంటిస్టుల విగ్రహాలను పెద్ద మొత్తంలో పెట్టి గ్రంథాలయం వాతావరణాన్ని నాశనం చేశారు.

వీసి రాజశేఖర్ వర్సిటీలో కుల రాజకీయాలను ప్రోత్సహిస్తూ తన కులం వారిని అందలం ఎక్కించి మిగతా కులాల వారిని పలు రకాలుగా వేధించి వర్సిటీ వాతావరణాన్ని కలుషితం చేశారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 01, జులై 2024





## ప్రభాస్..స్పిరిట్ మార్చాల్సిందే?

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన పాన్ వరల్డ్ మూవీ కల్కి 2898ఏడీ థియేటర్స్ లోకి వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అద్భుతమైన కలెక్షన్స్ తో ఈ మూవీ దూసుకుపోతోంది. వీకెండ్ పూర్తయ్యేనాటికి 500o కోట్లు కలెక్షన్స్ సాధించడం గ్యారెంటీ అనే మాట ట్రేడ్ పండితుల నుంచి వినిపిస్తోంది.

ఇదిలా ఉంటే కల్కి మూవీ వైబ్ కనీసం రెండు వారాల పాటు నడిచే అవకాశం ఉంది. దీని తర్వాత ప్రభాస్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ మూవీ చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాదిలోనే మూవీ షూటింగ్ స్టార్ట్ కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. కల్కి సినిమా సూపర్ హిట్ దిశగా దూసుకుపోతూ ఉండటంతో సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ పైన కూడా అంచనాలు పెరిగాయి. యానిమల్ సినిమాతో సందీప్ రెడ్డి వంగా గత ఏడాది బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. దీంతో స్పిరిట్ మూవీకి కూడా సందీప్ రెడ్డి వంగా కచ్చితంగా బెస్ట్ అవుట్ ఇస్తాడని డార్లింగ్ ఫ్యాన్స్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఈ చిత్రాన్ని టి-సిరీస్, సందీప్ రెడ్డి వంగా కలిసి నిర్మించబోతున్నారు. డార్లింగ్ ప్రభాస్ కెరియర్ ఇప్పటి వరకు చేయనటువంటి పోలీస్ ఆఫీసర్ రోల్ ని స్పిరిట్ చిత్రంలో చేయబోతున్నాడు. కథ కూడా చాలా పవర్ ఫుల్ గా ఉంటుందంట. సందీప్ రెడ్డి సినిమాలలో హీరో క్యారెక్టరైజేషన్ చాలా వైలెంట్ గా ఉంటుంది. స్పిరిట్ మూవీలో కూడా ప్రభాస్ పాత్ర అలాగే ఉండబోతోందంట. రీసెంట్ గా సందీప్ రెడ్డి, ప్రభాస్ మీట్ అయ్యారంట. ఈ సందర్భంగా సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్ నుంచి డిస్కషన్ జరిగినట్లు తెలుస్తోంది.

### యానిమాల్ తరహా

## 'జాట్'



నందమూరి బాలకృష్ణతో వీరసింహా రెడ్డి సినిమాను రూపొందించి సూపర్ హిట్ ను దక్కించుకున్న దర్శకుడు గోపీచంద్ మలినేని వెంటనే మరో సినిమాను చేయాలని భావించినప్పటికీ కొన్ని కారణాల వల్ల చాలా ఆలస్యం అయ్యింది. దాదాపు ఏడాది పాటు జరిపిన చర్చల తర్వాత చివరకు బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ తో సినిమా మొదలు పెట్టాడు. టాలీవుడ్ హీరోతో మొదట ఈ సినిమాను చేయాలని భావించినా కూడా బడ్జెట్ విషయంలో కాస్త ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని భావించి ఆ సినిమా క్యాన్సల్ చేశారు. గదర్ 2 సినిమా తో సూపర్ హిట్ ను దక్కించుకున్న సన్నీ డియోల్ తో తన కథ ను సినిమాగా చేయాలని దర్శకుడు గోపీచంద్ మలినేని భావించాడు. పాన్ ఇండియా రేంజ్ లో సన్నీ డియోల్ మరియు గోపీచంద్ మలినేని కాంబో మూవీ రూపొందబోతుందట. తాజాగా ఈ సినిమాకు 'జాట్' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లుగా సమాచారం అందుతోంది. అతి త్వరలోనే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా టైటిల్ తో పాటు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. వయసుకు తగ్గ పాత్రలో సన్నీ డియోల్ పాత్రలో కనిపించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ వారు ఈ సినిమా ను హిందీ సినిమాగా నిర్మిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఈ అరుదైన కలయిక మూవీని ఇదే ఏడాదిలో విడుదల చేస్తారనే సమాచారం.

## అప్పుడు తెలియక తప్పు చేశాను

సమంత హీరోయిన్‌గా ఈ అమ్మడు సంపాదించుకున్న స్టార్‌డమ్ మాములుది కాదు. కెరీర్ తొలినాళ్ల నుంచి వరుస విజయాలను అందుకుంది. అగ్ర హీరోయిన్లలో ఒకరిగా పేరు సంపాదించుకుంది. అనంతరం నాగ చైతన్యతో వివాహం చేసుకున్న తర్వాత కూడా సినిమాలను కొనసాగించింది. హీరోయిన్‌గా వరుస అవకాశాలు దక్కించుకుంటున్న సమయంలోనే నాగ చైతన్యతో విడాకులు, ఆ తర్వాత మయోసైటిట్ వ్యాధి బారిన పడింది. దీంతో సినిమాలకు చాలా గ్యాప్ ఇచ్చింది సామ్. ప్రస్తుతం సామ్ చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. అయితే ఇటీవలే ఓ వెబ్ సిరీస్‌కు ఈ బ్యూటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే సినిమాలు లేకపోయినా సోషల్ మీడియా ద్వారా నిత్యం అభిమానులతో టచ్ ఉండే సామ్, ఫ్యాన్స్ అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. గతంలో తాను ఓ విషయంలో తెలియక తప్పు చేశానని చెప్పుకొచ్చింది. గతంలో సమంత కొన్ని అనారోగ్యకరమైన బ్రాండ్స్‌ని ప్రమోట్ చేసిన విషయమై అభిమాని ప్రశ్నించాడు. దీనికి బదులిచ్చిన సమంత.. గతంలో తాను తప్పులు చేసిన మాట వాస్తవమేనని, అయితే అన్నవీ పూర్తిగా తెలియక చేసినవని చెప్పుకొచ్చారు. అయితే అసలు విషయం తెలుసుకున్న తర్వాత ప్రమోషన్స్ చేయడం ఆపేశానని తెలిపారు. ఇప్పుడు తాను ఏం చేస్తుందో వాటి గురించి మాత్రమే చెబుతున్నాని సమాధానం ఇచ్చారు.



## కల్కి రికార్డ్స్

ప్రభాస్ 'కల్కి2898 ఎడి' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. వరుసగా రెండవ రోజు కూడా మంచి వసూళ్లను రాబట్టింది. రెండో రోజు తెలుగులో రూ. 25.65 కోట్లు, హిందీలో రూ. 22.5 కోట్లు వసూలు చేసింది. డే 2 ఇండియాలో మొత్తం రూ. 149.3 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం.

స్టార్ కాస్ట్ ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె ప్రధాన పాత్రలో నటించిన మోస్ట్ యాంటిసిపేటెడ్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. ఫిల్మ్ క్రిటిక్, ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ప్రకారం 'కల్కి 2898 ఏడీ' తొలిరోజు హిందీలో 27.5 కోట్లు వసూలు చేయగా, వరల్డ్ వైడ్ గా రూ. 190 కోట్లు వసూలు చేసింది. భారతదేశంలో మొత్తం రూ .95 కోట్లు వసూలు చేసింది.

### కల్కి డే 2 కలెక్షన్స్

ఇక రెండో రోజు కూడా భారీ వసూళ్లను రాబట్టింది కల్కి. రెండవ రోజు కలెక్షన్ విషయానికొస్తే.. రూ. 54 కోట్లు కలెక్ట్ చేసినట్లు సెక్నిక్ రిపోర్ట్ తెలిపింది. తెలుగులో రూ. 25.65 కోట్లు, హిందీలో రూ. 22.5 కోట్లు వసూలు చేసింది. 'కల్కి 2898 ఏడీ' డే 2 ఇండియాలో మొత్తం రూ. 149.3 కోట్లు వసూలు చేసింది. ఇందులో అత్యధికంగా తెలుగు వెర్షన్ రూ. 91.45 కోట్లు రాబట్టింది. ఆ తర్వాత హిందీలో 45 కోట్లు రాబట్టింది.

### బాహుబలి, కేజీఎఫ్ రికార్డ్స్ బ్రేక్

కల్కి ఫస్ట్ డే కలెక్షన్స్ కేజీఎఫ్, బాహుబలి1,సాహెూ, జవాన్ తో సహా పలు పెద్ద సినిమాల రికార్డులను బ్రేక్ చేసింది. ఈ చిత్రం రెండు రోజుల్లో ప్రపంచ బాక్సాఫీస్ వద్ద రూ 250 కోట్లకు పైగా వసూలు చేసి రికార్డు సృష్టించింది. ఇదే జోరు కొనసాగితే ఈ సినిమా 'పఠాన్', 'జవాన్', 'జైలర్', బాహుబలి వంటి చిత్రాల రికార్డులను బద్దలు కొట్టడం ఖాయం.






## అమితాబ్‌ని సరిగ్గా వాడింది వారే

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ మూవీ 'కల్కి 2898 ఎడి'. గురువారం వరల్డ్ వైడ్ గా రిలీజైన ఫ్యూచరిస్టిక్ ఇండియన్ సినిమా, బాక్సాఫీస్ వద్ద రికార్డ్ స్థాయి ఓపెనింగ్స్ రాబట్టింది. మైండ్ బ్లోయింగ్ విజువల్స్ తో పాటుగా ప్రధాన పాత్రధారుల నటన హైలైట్ గా నిలిచాయి. ముఖ్యంగా అమితాబ్ బచ్చన్ పోషించిన పాత్రకు, ఆయన నటనకు అంతటా ప్రశంసలు దక్కుతున్నాయి. 'కల్కి' సినిమాలో అశ్వద్ధామ పాత్రలో నటించారు బాలీవుడ్ సీనియర్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్. కృష్ణుడి శాపం వల్ల ద్వాపరయుగం నుంచి 6 వేల సంవత్సరాలకు పైగా భూమిపై జీవిస్తున్న అమరుడిగా కనిపించారు. ఈ ఐకానిక్ క్యారక్టర్ కు బిగ్ బీ పర్ఫెక్ట్ గా సూట్ అవ్వడమే కాదు, అద్భుతమైన నటన కనబరిచారు. 3 గంటల మూవీలో ఆయన 25 నిమిషాల పాటు కనిపించి, సినిమా మొత్తాన్ని ప్రభాస్ తో కలిసి తన భుజాలపై మోసారు. 81 ఏళ్ల వయసులోనూ ప్రభాస్ కు ధీటుగా యాక్షన్ సీన్స్ చేశారు. 'ది హాబిట్' 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' వంటి హాలీవుడ్ చిత్రాల్లోని గాండాల్ఫ్ ను గుర్తు చేశారు. కల్కి సినిమా కోసం అమితాబ్ బచ్చన్ చాలా కష్టపడ్డారు. కర్రతో ఫైట్ సీక్వెన్స్ కోసం సెట్స్ లో ప్రాక్టీస్ చేశారు. అందుకే ఇప్పుడు భైరవ, అశ్వత్థామ పాత్రల మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను బాగా అలరిస్తున్నాయి. ఇక అశ్వత్థామగా మేకప్ వేసుకోడానికి, దాన్ని తీసేయడానికి కొన్ని గంటల సమయం పట్టేదని చిత్ర బృందం తెలిపింది. అయినా సరే ఆయన అంతసేపూ ఎంతో ఓపికగా ఉండి, షూటింగ్ చేసేవారట. ఇది సినిమాపై ఆయనకున్న నిబద్ధత, అంకితభావాలను తెలియజేస్తుంది.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144